TGTEL/25/A0977

# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 65 | శనివారం 1-11-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.

## చేతులు ఎత్తితే సభాపతి కావచ్చు.. ఎమ్మెల్యే కాలేరు ప్రదీప్ ఈశ్వర్

బెంగళూరు: రాజకీయాలలో ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజమే కానీ ఇటీవల అన్ని విషయాలలోను కాంగ్రెస్‌కు చెందిన వారు హాట్‌టాపిక్ గా మారుతున్నారు. అటువంటి వారిలో చిక్కబళ్ళాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ కూడా ఒకరు. ఇటీవల మీడియాతో మాట్లాడిన పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి ఓ ప్రశ్నకు సమాధానంగా ప్రదీప్ ఈశ్వర్ ఓ ఆకస్మిక ఎమ్మెల్యే అన్నారు. అందుకు ప్రదీప్ ఈశ్వర్ శుక్రవారం స్పందిస్తూ.. పరిషత్‌లో సభ్యులు చేతులు ఎత్తితే సభాపతి కాగలరని కానీ ఎమ్మెల్యే కావడం సాధ్యం కాదన్నారు. కనీసం లక్ష ఓట్లు కావాలన్నారు. అయితే ప్రదీప్ ఈశ్వర్ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సభాపతి బసవరాజ హొరట్టి ఏడుసార్లు వరుసగా ఒకే స్థానం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన వారు. అటువంటి చరిత్ర కలిగిన వారు బహుశా దేశంలోనే లేరు. అటువంటి సీనియర్ నేతపైనా నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని విమర్శలు వ్యక్తం కాగా కొందరు ప్రదీప్ ఈశ్వర్‌కు మద్దతుగాను సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు.

## తారవ్వ ధాన్యం కొనుగోలు

- వరదలో నష్టపోయిన హుస్నాబాద్
- మహిళారైతు ఖాతాలో డబ్బులు జమ - బండి సంజయ్ రూ.50 వేల సాయం

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 31:** కష్టనష్టాలకోర్చి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి తెస్తే.. మొంథా తుఫాను ప్రభావంతో వరద పాలైన తారవ్వ ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన కేడిక తారవ్వ తన ఐదెకరాల్లో పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి హుస్నాబాద్ మార్కెట్ యార్డుకు వచ్చింది. తేమ పేరుతో తూకం వేయడానికి అధికారులు తాత్సారం చేయడంతో.. బుధవారం కురిసిన భారీ వర్షానికి ఆమె తెచ్చిన ధాన్యంలోంచి 80 శాతం పైగా కొట్టుకుపోయింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు.. తారవ్వ వద్ద నుంచి 106.80 క్వింటాళ్ల తడిచిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేసిన పౌర సరఫరా అధికారులు, శుక్రవారం సాయంత్రం ఆమె భర్త రవీందర్‌రెడ్డి ఖాతాలో రూ.2.55 లక్షలను జమ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి తారవ్వ కృతజ్ఞతలు తెలిపారు.



# అభివృద్ధిని గెలిపించాలి

### కంటోన్మెంట్‌లో 4 వేల కోట్లతో పనులు చేపట్టాం

### జూబ్లీహిల్స్‌లో రోడ్డు షోలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు 31:** ఎన్నికల్లో చూడాల్సింది సెంటిమెంట్‌ను కాదని, అభివృద్ధిని గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ఓటర్లకు పిలుపునిచ్చారు. మాగంటి గోపీనాథ్ కుటుంబంపై తనకు సానుభూతి ఉందని, అయితే మూడుసార్లు గెలిస్తే జరగని అభివృద్ధి.. నాలుగోసారి గెలిస్తే జరుగుతుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి రోడ్డు షో నిర్వహించారు. వెంగళ్‌రావునగర్, సోమాజిగూడ జవహర్‌నగర్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. బీఆర్‌ఎస్ వాళ్లు సెంటిమెంట్‌ను చూపించి గెలిపించాలంటున్నారని, కానీ.. 2007లో పీజేఆర్ మరణించినప్పుడు ఆయన కుటుంబంలోని వ్యక్తిని ఏకగ్రీవం చేద్దామంటే జానా్నై అంటూ అభ్యర్థిని నిలబెట్టలేదా? అని ప్రశ్నించారు. నాడు చంద్రబాబునాయుడు, బీజేపీ కూడా పీజేఆర్‌పై ఉన్న గౌరవంతో రాజకీయ వైరుధ్యాన్ని పక్కన పెట్టారని, పీజేఆర్ కుటుంబానికి అండగా నిలిచి.. మరణించిన కుటుంబంలో ఏకగ్రీవానికి ప్రయత్నించారని తెలిపారు. అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఈ మంచి సంప్రదాయాన్ని తుంగలో తొక్కి.. దుష్ట సంప్రదాయాన్ని తీసుకొచ్చింది బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కాదా? అని నిలదీశారు. పీజేఆర్ కుటుంబానికి వ్యతిరేకంగా ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టిన బీఆర్‌ఎస్.. నేడు సానుభూతి ఓట్లను అడుగుతోందని మండిపడ్డారు.

"ఆనాటి సీఎం, మునిసిపల్ శాఖ మంత్రి మీ బస్తీలకు వచ్చారా? మీ సమస్యలను పరిష్కరించారా? పదేళ్లలో ఏనాడైనా సినీ కార్మికులను కలిశారా? పలకరించారా? కనీసం వాళ్ల ఆరోగ్యం దెబ్బతింటే దవాఖానాల్లో మందు వేయాలనే ఆలోచన చేశారా?" అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో సానుభూతి కన్నీళ్ల ముసుగులో గెలవాలని అనుకుంటే.. అక్కడి ప్రజలు అభివృద్ధి కావాలంటూ శ్రీగణేష్‌ను గెలిపించారని తెలిపారు. కంటోన్మెంట్‌లో ఎన్నో ఏళ్లుగా ట్రాఫిక్ ఇబ్బందిగా మారిన ఎలివేటెడ్ కారిడార్లను, రోడ్డు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తున్నామని, రూ.4 వేల కోట్లతో అభివృద్ధి పనులు సాగుతున్నాయని అన్నారు. జూబ్లీహిల్స్ ప్రాంతం నుంచి ఓట్లు వేయించుకొని సికింద్రాబాద్ నుంచి రెండుసార్లు ఎంపీ, కేంద్ర మంత్రి అయిన కిషన్‌రెడ్డి.. మెట్రోరైలుకు, మూసీనది అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. "ఉప ఎన్నిక రాగానే జూబ్లీహిల్స్‌లో కార్పెట్ బాంబింగ్ చేస్తారట! సిగ్గుండాలి.. పాకిస్థాన్ మీద బాంబులు వేయరుగానీ.. జూబ్లీహిల్స్‌లో కార్పెట్ బాంబింగ్ చేయడానికి ఇదేమైనా బీజేపోళ్లా బాబు జాగీరా? ఎవరైనా అభివృద్ధి చేయాలనుకుంటారు. బీజేపీ వాళ్లు బిచ్చమడిగేందుకు వస్తారా?" అంటూ రేవంత్ మండిపడ్డారు. నగరాన్ని అభివృద్ధి చేస్తే కాంగ్రెస్‌కు పేరు వస్తుందని, తమకు పుట్టగతులు ఉండవనే ఉద్దేశంతో బీజేపీ, బీఆర్‌ఎస్ అడ్డుపడుతున్నాయని ఆరోపించారు. బీజేపీ, బీఆర్‌ఎసలది ఫెవికాల్ బంధమన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ చచ్చిపోయి బీజేపీని గెలిపించింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా రాష్ట్రానికి నయా పైసా తీసుకొచ్చారా? అని నిలదీశారు.

### మంత్రిగా అజారుద్దీన్

# ప్రమాణ స్వీకారం

### రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, నేతలు
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే నా తక్షణ కర్తవ్యం
- నా గురించి కిషన్‌రెడ్డికి అవగాహన లేదు
- నాపై వచ్చినవి అన్నీ ఆరోపణలే..
- ఒక్కటి కూడా రుజువు కాలేదు: అజారుద్దీన్



**హైదరాబాద్, అక్టోబరు 31 :** కాంగ్రెస్ నేత అజారుద్దీన్ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్లో అజారుద్దీన్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అల్లా సాక్షిగా ప్రమాణం చేసిన ఆయన జై తెలంగాణ, జైహింద్ అంటూ నినదించారు. ప్రమాణ స్వీకారం అనంతరం వేదికపై ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రులు, ఇతర నేతలు అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేషకుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. మంత్రిగా తనకు అవకాశం దక్కినందుకు సంతోషంగా ఉందని, తనను మంత్రిగా చూసినందుకు తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సంతోషపడ్డారని అజారుద్దీన్ చెప్పారు. తన తక్షణ కర్తవ్యం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించడమేనన్నారు. మరోవైపు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తనపై చేసిన ఆరోపణలపై అజారుద్దీన్ స్పందించారు. తన గురించి కిషన్‌రెడ్డికి పూర్తిస్థాయిలో అవగాహన లేదన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు సరైనవి కావని, ఒక్క కేసులోనూ నేరం రుజువు కాలేదని చెప్పారు. భారత క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా అజారుద్దీన్ దేశానికి ఎన్నో విజయాలను అందించిన సంగతి మరిచారా అని టీపీసీసీ అధ్యక్షుడు మహేషకుమార్‌గౌడ్.. కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి నిర్ణయం 3నెలల కిందటే తీసుకున్నామన్నారు. ప్రభుత్వ సలహాదారుగా సుదర్శన్‌రెడ్డి, పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా ప్రేమ్‌సాగర్‌రావులను ప్రభుత్వం నియమించడాన్ని మహేషకుమార్‌గౌడ్ స్వాగతించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీభవన్లో ఆమె చిత్రపటానికి మహేషకుమార్‌గౌడ్ నివాళి అర్పించారు. ఎంఐఎంతో మ్యాచ్ ఫిక్సింగ్ వల్లే కాంగ్రెస్ నాయకుడు అజారుద్దీన్‌కు మంత్రి పదవి వచ్చిందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. క్రికెట్‌లోనే కాదు, రాజకీయాల్లో కూడా అజర్ మ్యాచ్ ఫిక్సరే అని ఆయన ఆరోపించారు. జుబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే, ఒక వర్గం ఓట్ల కోసం మంత్రి పదవి ఇచ్చారన్నారు. ఒవైసీ చెబితేనే కాంగ్రెస్.. నవీన్‌యాదవ్‌కు టికెట్టు, అజర్‌కు మంత్రి పదవి ఇచ్చిందని ఆయన అన్నారు.

## లండన్ పర్యటనకు చంద్రబాబు



**అమరావతి, అక్టోబరు 31:** వ్యక్తిగత పర్యటనలో భాగంగా సతీమణి భువనేశ్వరితో కలిసి సీఎం చంద్రబాబు శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరి వెళ్లనున్నారు. ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ భువనేశ్వరికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐవోడీ) సంస్థ నవంబరు 4న డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025 అవార్డు అందించనుంది. అలాగే, హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో లభించిన గోల్డెన్ పీకాక్ అవార్డును కూడా అదే వేదికపై భువనేశ్వరి అందుకోనున్నారు. లండన్‌లోని గ్లోబల్ కన్వెన్షన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి చంద్రబాబు హాజరవుతారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, హిందూజా గ్రూప్ కో చైర్మన్ గోపీచంద్, ఆదిత్య బిర్లా సెంటర్ ఫర్ కమ్యూనిటీ ఇనీషియేటివ్స్ చైర్‌పర్సన్ రాజశ్రీ బిర్లా, సన్ ఫార్మా ఎండీ దిలీప్ సంఘ్వీ, దుబాయ్ ఎలక్ట్రిసిటీ, వాటర్ అథారిటీ ఎండీ సయీద్ మహ్మద్, హీరో ఎంటర్ ప్రైజెస్, గోయెంకా గ్రూప్ సంస్థల చైర్మన్ సంజీవ్ గోయెంకా వంటి ప్రముఖులు గతంలో ఈ అవార్డును అందుకున్నారు.

# 8 వారాల సమయం ఇవ్వండి

- నలుగురు ఎమ్మెల్యేల విచారణ పూర్తయింది
- మరో నలుగురి విచారణ చివరి దశకు చేరింది
- మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేల ప్రక్రియ ప్రారంభమైంది
- స్పీకర్ల కాన్ఫరెన్స్, విదేశీ పర్యటనలతో ఆలస్యమైంది
- వరద సహాయ చర్యలు, పనుల్లో ఎమ్మెల్యేలూ బిజీ
- ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసుల విచారణకు సుప్రీంను మరింత గడువు కోరిన స్పీకర్ కార్యాలయం



**న్యూఢిల్లీ, అక్టోబరు 31:** తెలంగాణలో శాసన సభ్యుల పార్టీ ఫిరాయింపు ఆరోపణలపై విచారణ జరిపేందుకు మరో ఎనిమిది వారాల సమయం ఇవ్వాలని సుప్రీం కోర్టును స్పీకర్ కార్యాలయం కోరింది. గతంలో విధించిన మూడు నెలల గడువు శుక్రవారంతో ముగియడంతో మరింత సమయం ఇవ్వాలని సర్వోన్నత న్యాయస్థానానికి విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేల విచారణ పూర్తయిందని, నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలిపింది. మరో నలుగురు ఎమ్మెల్యేలకు సంబంధించిన విచారణ చివరి దశకు చేరిందని, ఇంకో ఇద్దరు ఎమ్మెల్యేల విచారణ ప్రారంభమైందని వివరించింది. రాజ్యాంగపరమైన స్పీకర్ అధికారాలు, రోజువారీ కార్యక్రమాలు, స్పీకర్ల అంతర్జాతీయ సదస్సులు, విదేశీ పర్యటనలు తదితరాలతో స్పీకర్ బిజీగా ఉన్నారని, దాంతో, గడువులోగా విచారించడం సాధ్యం కాలేదని తెలిపింది. శాసన సభ్యులు సైతం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, వరద సహాయక చర్యల కారణంగా నియోజకవర్గాల్లోనే ఉండాల్సి వస్తోందని పేర్కొంది. ఎమ్మెల్యేలను నేరుగా విచారించాల్సి ఉందని, స్పీకర్, శాసనసభ్యుల షెడ్యూల్ కార్యక్రమాల కారణంగా సమయం సరిపోలేదని పేర్కొంది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి పార్టీ ఫిరాయించారని పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (సివిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే.అదేరోజు ఎమ్మెల్యేలు పరిగి శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, ప్రకాశ్ గౌడ్, ఆరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, సంజయ్ కుమార్ పార్టీ ఫిరాయించారని కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, చింత ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్ కూడా సుప్రీంలో రిట్ పిటిషన్ (సివిల్) దాఖలు చేశారు. వాదనలు జరుగుతుండగా బీజేపీ ఎమ్మెల్యే ఆలేటి మహేశ్వర్ రెడ్డి కూడా స్పెషల్ లీవ్ పిటిషన్ (సివిల్) దాఖలు చేశారు. వీటన్నిటినీ కలిపి విచారించిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం జూలై 31న కీలక ఆదేశాలు జారీ చేసింది. సాధ్యమైనంత త్వరగా లేదా మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఎమ్మెల్యేలు ఎవరూ విచారణను ఆలస్యం చేయడాన్ని అనుమతించకూడదని, ఆలస్యం చేసేందుకు ప్రయత్నిస్తే తీవ్రంగా పరిగణించాలని స్పీకర్‌కు సూచించింది. ఈ నేపథ్యంలోనే మరికొంత సమయం కావాలంటూ సుప్రీంకోర్టుకు స్పీకర్ కార్యాలయం విన్నవించింది.

## బీజేపీ ఎంపీకి బెదిరింపులు

గోరఖ్‌పూర్: భారతీయ జనతా పార్టీ గోరఖ్‌పూర్ పార్లమెంటు సభ్యుడు, నటుడు రవి కిషన్ శుక్లా ను చంపుతామంటూ నేరుగా ఫోనులో బెదిరింపులు వచ్చాయి. బిహార్ నుంచి ఈ కాల్ వచ్చినట్టు తెలుస్తోంది. తన పేరును ఆరా జిల్లా జ్యానియా గ్రామానికి చెందిన అజయ్ కుమార్ యాదవ్‌గా అతను పరిచయం చేసుకుంటూ, ఎంపీని చంపుతానంటూ బెదిరించాడు. రవికిషన్ ప్రైవేటు సెక్రటరీ శివం ద్వివేది ఈ ఫోన్ రిసీవ్ చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఆ వ్యక్తి ఎంపీని దూషిస్తూ యాదవులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు గాను కాల్చిచంపుతానని బెదిరించినట్టు తెలిపారు. దీనిపై శివం ద్వివేది వివరణ ఇచ్చారు. ఎంపీ రవికిషన్ శుక్లా ఎన్నడూ ఏ కులంపైనా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయలేదని అన్నారు. ఫోను చేసిన వ్యక్తి ఎంపీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో పాటు ఆయన కదలికలను ఎప్పుడుకప్పుడు గమనిస్తున్నానని, నాలుగు రోజుల తర్వాత బిహార్ వచ్చినప్పుడు ఆయనను చంపుతానని బెదిరించాడని చెప్పారు. కాగా, కాలర్ తన సంభాషణల్లో శ్రీరాముడు, అయోధ్య మందిరంపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తోంది. కాగా, ఎంపీకి బెదిరింపు ఫోన్ రావడంపై ఆయన సెక్రటరీలు శివం ద్వివేది, పవన్ దూబే నేరుగా గోరఖ్‌పూర్ సీనియర్ పోలీసు అధికారులను కలిసి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. కాలర్‌పై చర్యలు తీసుకోవాలని, ఎంపీకి భద్రత పెంచాలని కోరారు. దీనిపై తాము విచారణ ప్రారంభించామని, కాలర్ ఆచూకీని గుర్తిస్తామని, ఎంపీ భద్రతను కూడా సమీక్షిస్తామని పోలీసులు చెప్పారు.

# నవీన్‌యాదవ్ ఆకు రౌడీ

### మీ తీర్పు తెలంగాణ గోస తీర్చాలి

### షేక్‌పేట రోడ్ షోలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్/సిటీ, అక్టోబరు 31:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ తరపున బరిలో నిలిచిన నవీన్‌యాదవ్ ఓ ఆకురౌడీ అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇప్పుడే అందరినీ భయపెడుతున్న ఆయన్ను పొరపాటున గెలిపిస్తే.. టీస్టాల్ వాళ్లు సహా అందరినీ బెదిరిస్తారని చెప్పారు. అతను ఎమ్మెల్యే అయితే ఎంతో ప్రమాదకరమన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు తెలివిగా ఆలోచించి, ఓటెయ్యాలని పిలుపునిచ్చారు. మజ్లిస్ పార్టీకి చెందిన పలువురు నేతలు శుక్రవారం బీఆర్‌ఎసలో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో, షేక్‌పేటలో నిర్వహించిన రోడ్ షోలో కేటీఆర్ మాట్లాడారు. కొందరు కాంగ్రెస్ నేతలు ప్రజల్ని బెదిరిస్తున్నారని, వారికి ఎవరూ భయపడొద్దని, బీఆర్ ఎస్ అండగా ఉంటుందని చెప్పారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పనిచేయాలని, కారు గుర్తుకు ఓటేసి మాగంటి సునీతను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నోటికొచ్చిన హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఈ రెండేళ్లలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని విమర్శించారు. తులం బంగారం ఇస్తాం.. యువతులకు స్కూటీలు ఇస్తాం.. వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇస్తాం.. అంటూ ఎన్నో హామీలిచ్చిన కాంగ్రెస్.. ఒక్క దాన్ని కూడా అమలు చేయలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలకు ఎంతో బాకీ పడిందని, ఉప ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థిని గెలిపించాలంటూ డబ్బులు ఇస్తే.. తీసుకొని మిగతా డబ్బులు ఎప్పుడిస్తారో నిలదీయాలని చెప్పారు. పేదల ఇళ్లను కూలగొట్టిన బుల్డోజర్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో అరచేతిలో స్వర్గం చూపిస్తామంటూ 420 హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెసకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని కేటీఆర్ కోరారు. నియోజకవర్గంలోని నాలుగు లక్షల ఓటర్ల తీర్పు.. తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజల గోస తీర్చేలా ఉండాలన్నారు. కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతేనే ఇచ్చిన హామీలు అమలవుతాయని, పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే.. రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని, ప్రజలను పట్టించుకోదని అన్నారు.



# అజారుద్దీన్ ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకోవడం బీజేపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనం

## - మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 31:** బీజేపీ ప్రవర్తన పూర్తిగా ద్వంద్వ వైఖరికి నిదర్శనమని రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. మాజీ క్రికెటర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అజారుద్దీన్‌కు మంత్రి పదవిపై అభ్యంతరం వ్యక్తం చేయడం ద్వారా బీజేపీ తన స్వార్థ రాజకీయాలను మరోసారి బయటపెట్టిందని ఆయన అన్నారు. రాజస్థాన్‌లోని గంగాపూర్ జిల్లా కరణ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే గుర్మీత్ సింగ్ కూనర్ ఆకస్మిక మరణంతో 2024 జనవరి 5న ఉపఎన్నిక జరిగిందని, ఆ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి సురేంద్రపాల్ సింగ్ 2023 డిసెంబర్ 30న అంటే ఎన్నికకు కేవలం ఆరు రోజుల ముందే బీజేపీ ప్రభుత్వంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గుర్తు చేశారు. "అయితే ఇంత ముఖ్యమైన విషయాన్ని బీజేపీ తెలంగాణ నాయకులు తెలియక పోవచ్చా? తెలిసీ అజారుద్దీన్ ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకోవడం, ఇది బీజేపీ ద్వంద్వ వైఖరికి స్పష్టమైన ఉదాహరణ కాదా?" అని ఆయన ప్రశ్నించారు. మాజీ క్రీడాకారుడు, అంతర్జాతీయ స్థాయిలో దేశానికి గౌరవం తెచ్చిన అజారుద్దీన్‌పై బీజేపీ చూపిస్తున్న అసహనం, రాజకీయ ద్వేషం దురదృష్టకరమని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ప్రజాప్రతినిధికి సమాన హక్కులు ఉన్నాయనీ, రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ ఇలాంటి అడ్డంకులు సృష్టించడం న్యాయసమ్మతం కాదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రజలు ఈ ద్వంద్వ వైఖరిని గుర్తించి బీజేపీ నిజ స్వరూపాన్ని అర్థం చేసుకుంటారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# ఆలోచనల మార్పు దిశగా "మైండ్‌సెట్ షిఫ్ట్"

## పుస్తక రచయిత శరాణి పొంగూరును అభినందించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**హైదరాబాద్, అక్టోబర్ 31:** జీవితాన్ని సానుకూల దిశగా మలిచే ఆలోచనలను ప్రేరేపించే "మైండ్‌సెట్ షిఫ్ట్" (%వీఱఅఅసంవ్ రాష్ట్రఱట్%) పుస్తకాన్ని రచించిన శరాణి పొంగూరును ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో రచయిత శరాణి పొంగూరు పవన్ కళ్యాణ్‌ను కలసి పుస్తక ప్రతిని అందజేశారు. "మైండ్‌సెట్ షిఫ్ట్" పుస్తకం ద్వారా రచయిత కృతజ్ఞత, స్వీయ అవగాహన, సానుకూల అలవాట్లు, ఆత్మవిశ్వాసం వంటి అంశాలను పాఠకుల్లో నాటడం లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. ఈ పుస్తకం ముఖ్యంగా యువతలో ఆలోచనల్లో స్పష్టత, జీవితంలో సమతుల్యత, సానుకూల దృక్పథం పెంపొందించేందుకు దోహదం చేస్తుందని పవన్ కళ్యాణ్ అన్నారు. అలాగే, రచయిత



రూపొందించిన "మైండ్‌సెట్ షిఫ్ట్ వర్క్‌బుక్" ద్వారా పాఠకులు తమ ఆలోచనలను ఆచరణలోకి తేవడానికి ఉపయోగపడే మార్గదర్శనం అందిందని పేర్కొన్నారు. ఈ తరహా రచనలు నేటి వేగవంతమైన ప్రపంచంలో యువతకు మానసిక బలం, ధైర్యం, దిశానిర్దేశం కలిగించగలవని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా రచయిత శరాణి పొంగూరు మాట్లాడుతూ.. "నా పుస్తకం ద్వారా పాఠకులు తమలోని ఆలోచనా మార్పును గుర్తించాలి, చిన్న అలవాట్లతో పెద్ద మార్పులు సాధ్యమవుతాయి అనే నమ్మకం నాలో ఉంది" అని తెలిపారు. కార్యక్రమం అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శరాణి పొంగూరును అభినందిస్తూ, "యువతలో చైతన్యపూర్వక జీవన విధానాన్ని ప్రేరేపించే ఈ ప్రయత్నం అభినందనీయం" అన్నారు.

# పోచారం డాక్టర్స్ కాలనీలో రూ.30 కోట్ల ప్రభుత్వ భూమిని రక్షించిన హైడ్రా

## కబ్జాల చెర నుంచి 4 వేల గజాల పార్కుకు విముక్తి







**మేడ్చల్-మల్కాజిగిరి, అక్టోబర్ 31:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘటకేసర్ మండలం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడ, డాక్టర్స్ కాలనీలో ప్రభుత్వ భూమిపై జరిగిన పెద్ద ఎత్తున కబ్జాలకు హైడ్రా చెక్ పెట్టింది. దశాబ్దాలుగా వివాదంలో ఉన్న 4 వేల గజాల పార్కు స్థలంను స్వాధీనం చేసుకుని, ప్రభుత్వం అధీనంలోకి తీసుకోవడం ద్వారా హైడ్రా మరోసారి తన కట్టుదిట్టమైన భూసంరక్షణ ధోరణిని చాటుకుంది. ఈ భూమి విలువ సుమారు రూ.30 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. 1985లో ఈ ప్రాంతంలో 26.9 ఎకరాల పరిధిలో సుమారు 500 ప్లాట్లతో లేఔట్ వేయబడింది. అప్పట్లో లేఔట్‌లో పార్క్ కోసం 4 వేల గజాల స్థలం కేటాయించినప్పటికీ, ఆ భూమిని క్రమంగా ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించినట్టు విచారణలో బయటపడింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఆ లేఔట్ వేసిన నాటి భూయజమానులే ఈ కబ్జాలకు పాల్పడినట్లు తేలింది. ఆముదాల నరసింహ కుమారుడు ఆముదాల రమేష్, ఆ స్థలాన్ని తప్పుడు పత్రాలతో కులకర్ణి అనే వ్యక్తికి 800 గజాల చొప్పున ఐదు ప్లాట్లుగా విక్రయించాడు. కులకర్ణి తిరిగి వాటిని 200 గజాల చొప్పున 20 ప్లాట్లుగా విభజించి రాజేష్, సోమానితో పాటు పలువురికి అమ్మాడు. దీంతో పార్క్ స్థలం పూర్తిగా ఆక్రమణలోకి వెళ్లింది. ఈ భూమి దందాపై డాక్టర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు సంబంధిత శాఖలతో కలిసి క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టారు. విచారణలో ఆ భూమి పార్క్ స్థలంగా లేఔట్ మ్యాప్‌లో స్పష్టంగా ఉన్నట్లు తేలింది. తదుపరి చర్యగా హైడ్రా అధికారులు శుక్రవారం భారీ బలగాలతో అక్కడ ఆక్రమణలు తొలగించి, మొత్తం నాలుగు వేల గజాల భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. పార్క్ చుట్టూ ఫెన్సింగ్ వేసి, హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో దశాబ్దాలుగా సాగుతున్న ఈ వివాదానికి పూర్తి ముగింపు లభించింది. కాలనీ నివాసులు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. "మా పిల్లల కోసం ఉన్న పార్కును కాపాడినందుకు హైడ్రాకు ధన్యవాదాలు. ఇంతకాలం మేము న్యాయం కోసం పోరాడాము, చివరికి విజయం సాధించాము" అని వారు తెలిపారు. ప్రభుత్వ భూములపై కబ్జాలను అరికట్టడంలో హైడ్రా తీసుకున్న ఈ చర్య రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు పొందుతోంది. భవిష్యత్తులో కూడా ఇటువంటి ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# తుఫాను ప్రాంతాల పర్యటన.. రైతులకు భరోసా

## - మంత్రి అనిత వంగలపూడి





**అనకాపల్లి, అక్టోబర్ 31:** అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గంలోని రాంబిల్లి మండలంలో మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలను రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి అనిత వంగలపూడి సందర్శించారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌లతో కలిసి మంత్రి అనిత ఈ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా కొప్పుకొండపాలెం, వైలోవ, రజాల గ్రామాల్లో తుఫాను ప్రభావాన్ని పరిశీలించారు. రజాల సమీపంలోని గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడిన ఆమె, పంట నష్టాలపై అధికారులు ఇప్పటికే నివేదికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల వెంటే ఉంది. ప్రతి నష్టపోయిన కుటుంబానికి అవసరమైన సాయం అందేలా చర్యలు తీసుకుంటాం" అని మంత్రి అనిత హామీ ఇచ్చారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో జరుగుతున్న సహాయక చర్యలను ఆమె సమీక్షించారు. %చీణ%=%ఖీ% సిబ్బందిని కలుసుకొని, గండి పడిన ప్రాంతంలో జరుగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ప్రభుత్వం తరఫున తక్షణ సాయం, మౌలిక వసతుల పునరుద్ధరణపై దృష్టి పెట్టినట్లు ఆమె తెలిపారు. ఈ పర్యటనతో స్థానిక ప్రజల్లో నూతన నమ్మకం నెలకొంది.

### జాతీయ ఐక్యతా దినోత్సవంగా

# సర్దార్ జయంతి వేడుకలు

## - సీఎం చంద్రబాబు నివాళి



**అమరావతి, అక్టోబర్ 31:** దేశ సమగ్రతకు ప్రతీకగా నిలిచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని దేశవ్యాప్తంగా జాతీయ ఐక్యతా దినోత్సవంగా ఘనంగా జరుపుకుంటు న్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీఎం క్యాంపు కార్యాలయంలో సర్దార్ పటేల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, సర్దార్ పటేల్ భారత ఏకీకరణకు చేసిన కృషి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశ ఐక్యత, భద్రత, అభివృద్ధి కోసం ప్రతి పౌరుడు ఆయన ఆదర్శాలను అనుసరించాలని పిలుపునిచ్చారు.

# జూబ్లీహిల్స్‌లో ప్రజల ఆవేదన

## - కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యంపై ఆగ్రహం




**హైదరాబాద్, అక్టోబర్ 31:** జూబ్లీహిల్స్ ప్రజల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. పన్నెండేళ్లుగా ఈ రెండు పార్టీలను నమ్మి ఓటు వేసిన ప్రజలు నేడు మోసపోయామని, తమ ప్రాంత అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయకులు అధికారంలోకి వచ్చి సంపన్నులై సుఖంగా ఉన్నా, ప్రజలు మాత్రం ప్రాథమిక సౌకర్యాలు లేక నరకం అనుభవిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈసారి ప్రజలు మార్పుకు సిద్ధమయ్యారని, ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చరమగీతం పాడే సమయం వచ్చిందని పేర్కొన్నారు. అభివృద్ధి సాధించగలిగిన నాయకత్వం ప్రధాని నరేంద్ర మోదీదేనని, ఆయన పాలనను జూబ్లీహిల్స్‌కు తీసుకురావాలని బీజేపీ నేతలు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి లక్ష్మణ్ దాస్‌రాజును గెలిపించవలసిందిగా కేంద్ర మంత్రి జీ. కిషన్ రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయనతో పలువురు మహిళలు తమ సమస్యలను పంచుకున్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా ఎర్రగడ్డ డివిజన్‌లో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజి రెడ్డి, పార్టీ అభ్యర్థి లక్ష్మణ్ దాస్‌రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కంఠి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### సేవల రంగంలో దేశంలోనే


# అగ్రస్థానంలో తెలంగాణ

## - నితి ఆయోగ్ తాజా నివేదిక




**హైదరాబాద్, అక్టోబర్ 31:** తెలంగాణ రాష్ట్రం మరోసారి జాతీయస్థాయిలో తన ప్రతిభను చాటుకుంది. 2025 అక్టోబర్‌లో విడుదలైన నియతి ఆయోగ్ తాజా నివేదిక ప్రకారం, 2014 నుండి 2023–24 వరకు దేశంలో సేవల రంగంలో అత్యధిక వృద్ధి సాధించిన రాష్ట్రం తెలంగాణగా నిలిచింది. రాష్ట్ర స్థూల విలువ లో సేవల రంగం వాటా 9.6% పెరుగుదల నమోదు చేసింది. ఇది దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే అత్యధికం. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో సేవల రంగం వాటా 2011–12లో 52.8% ఉండగా, లి2023–24 నాటికి 62.4%లికు పెరిగింది. దశాబ్ద కాలంలో సగటు వాటా 60.3%గా నమోదైంది. భారతరాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేతృత్వంలోని మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు (కేసీఆర్) ప్రభుత్వం తీసుకున్న దూరదృష్టి నిర్ణయాలు, సమాచార సాంకేతికత ఆధారిత ఆర్థిక విధానాలు ఈ వృద్ధికి బలమైన పునాదిగా నిలిచాయని నివేదిక పేర్కొంది. టి-హబ్, టి-వర్క్స్, వీ-హబ్, ఇమేజ్ వంటి సృజనాత్మక సంస్థలను ఏర్పాటు చేసి, స్టార్టప్‌లు మరియు టెక్నాలజీ రంగ అభివృద్ధికి తెలంగాణను కేంద్రంగా తీర్చిదిద్దారు. ఈ సమగ్ర వృద్ధి ఎకోసిస్టమ్ తెలంగాణను దేశంలో సేవల రంగానికి హబ్‌గా మార్చిందని అధికారులు అభిప్రాయపడ్డారు. మేము తెలంగాణను ప్రతి ఒక్కరికి గర్వకారణంగా నిలిచే రాష్ట్రంగా తీర్చిదిద్దాం. దృఢమైన విధానాలు, దూరదృష్టి నాయకత్వం ఉన్నప్పుడు మాత్రమే వృద్ధి సాధ్యమవుతుంది," అని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.

# క్రైమ్ రేటు పెరుగుదలతో తెలంగాణలో ఆందోళన




**హైదరాబాద్, అక్టోబర్ 31:**
తెలంగాణ రాష్ట్రంలో క్రైమ్ రేటు గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా పెరిగింది. 2024 సంవత్సరంలో మొత్తం నేరాల సంఖ్య 22.5 శాతం వృద్ధి చెందింది. 2023లో నమోదైన కేసులు సుమారు 1.38 లక్షలుగా ఉండగా, ఈ సంవత్సరం ఆ సంఖ్య 1.69 లక్షలకు చేరింది. ఈ పెరుగుదల రాష్ట్ర భద్రతా వ్యవస్థకు గట్టి సవాలుగా మారిందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్‌లు, మత్తు పదార్థాల వ్యాపారం, అలాగే యువత మధ్య వ్యక్తిగత విభేదాలు, ప్రేమ సంబంధిత పోరాటాలు గణనీయంగా పెరుగుతున్నాయని పోలీసులు పేర్కొన్నారు. సోషల్ మీడియా దుర్వినియోగం, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లు వంటి వాటి కారణంగా సైబర్ క్రైమ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. హైదరాబాద్‌లోని ఐటీ హబ్ ప్రాంతాల్లో నేరాల సంఖ్య అత్యధికంగా ఉందని నివేదికలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా గచ్చిబౌలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే అత్యధిక కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఐటీ ప్రొఫెషనల్స్, విద్యార్థులు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో సైబర్ మోసాలు, వ్యక్తిగత వివాదాలు, దొంగతనాలు అధికంగా ఉన్నాయని తెలిపారు.అదే సమయంలో, రాష్ట్రంలోని మరో ప్రాంతంలో చోటుచేసుకున్న దారుణమైన హత్య కేసు చర్చనీయాంశమైంది. ఒక యువ దంపతి ట్రాకర్ ఉపయోగించి బాధితుడి కదలికలను గమనించి, కాంట్రాక్ట్ కిల్లర్ల సహాయంతో హత్య చేసినట్లు పోలీసులు వివరించారు. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా భయాందోళన కలిగించింది.ప్రస్తుత పరిస్థితుల్లో, పోలీసులు అవగాహన కార్యక్రమాలు, పహారాలు, సాంకేతిక నిఘా బలోపేతం వంటి చర్యలు చేపడుతున్నప్పటికీ, క్రైమ్ రేటు నియంత్రణలో సవాళ్లు ఎదురవుతున్నాయని అధికారులు వెల్లడించారు.

# మొంథా' తుపానుతో రాష్ట్రానికి భారీ నష్టం

### పంట, ఆస్తి నష్టాలపై సమగ్ర నివేదికలు కోరిన సీఎం రేవంత్ రెడ్డి




**హన్మకొండ, అక్టోబర్ 31:**
తెలంగాణ రాష్ట్రాన్ని వణికించిన 'మొంథా' తుపాను కారణంగా పన్నెండు జిల్లాల్లో విస్తృతంగా నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. వరదల తీవ్రత, నష్టాలను ప్రత్యక్షంగా అంచనా వేసేందుకు సీఎం హెలికాప్టర్ ద్వారా వరద ప్రభావిత ప్రాంతాలపై ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం హన్మకొండ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా, రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, పంట నష్టం, ఆస్తి నష్టం, రోడ్లు, వంతెనలు, చెరువులు దెబ్బతిన్న స్థాయిపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రజాప్రతినిధుల వద్ద ఉన్న స్థానిక సమాచారం కూడా కలెక్టర్లకు అందజేసి, వాటిని నివేదికల్లో చేర్చాలని సూచించారు. అన్ని వివరాలను నిర్దిష్ట నమూనాలో సంకలనం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదికగా పంపించాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రం ధనికమైనప్పటికీ, కేంద్రం నుంచి రావాల్సిన సహాయక నిధులను వదులుకునే ప్రసక్తి లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులు వేగంగా చేపట్టాలని, అధికార యంత్రాంగం అలసత్వం ప్రదర్శిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.వరదల్లో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం రూ. 5 లక్షల పరిహారం ప్రకటించింది. ఇళ్లలో నీటమునిగిన బాధితులకు రూ. 15 వేల చొప్పున, గుడిసెలు కోల్పోయిన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గృహాలు మంజూరు చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. అదనంగా, వ్యవసాయ రంగంలో జరిగిన పంటనష్టానికి రైతులకు ఎకరాకు రూ. 10 వేల చొప్పున పరిహారం చెల్లించాలని సూచించారు. పశువుల నష్టానికి సంబంధించి, ఆవు లేదా గేదె మరణిస్తే రూ. 50 వేల చొప్పున, మేక, గొర్రె మరణిస్తే రూ. 5 వేల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. తుపాను ప్రభావం వల్ల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున, ప్రభుత్వం తక్షణ సాయాన్ని అందించడంలో ఎలాంటి రాజీ ఉండబోదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పక్కనే ఉందని, ప్రతి కుటుంబాన్ని ఆదుకునేందుకు చర్యలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# భగవద్గీత అవమానంపై రాజాసింగ్ ఆగ్రహం

### - ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై చర్యలు తీసుకోవాలంటూ చంద్రబాబుకు విజ్ఞప్తి



**హైదరాబాద్, అక్టోబర్ 31:**
తెలుగుదేశం పార్టీకి చెందిన మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చేసిన భగవద్గీత వ్యాఖ్యలపై తెలంగాణ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భగవద్గీత, హిందూ ధర్మాన్ని అవమానించేలా వ్యాఖ్యానించడం అసహ్యకరమని ఆయన ఖండించారు. శుక్రవారం విడుదల చేసిన వీడియోలో రాజాసింగ్ మాట్లాడుతూ, "ఎంఎస్ రాజు బుద్ధిలేని వ్యక్తి. హిందూ ధర్మంపై ఇలాంటి మాటలు మాట్లాడే హక్కు ఎవరికీ లేదు. అలాంటి వ్యక్తిని తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా నియమించడం హిందువుల మనోభావాలను దెబ్బతీసే చర్య" అని మండిపడ్డారు. రాజాసింగ్ మాట్లాడుతూ, "చంద్రబాబు నిజంగా హిందూ ధర్మాన్ని గౌరవిస్తే వెంటనే ఎంఎస్ రాజును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి. అలా చేస్తే భవిష్యత్తులో మరెవరూ ధర్మ గ్రంథాలపై నోరు విప్పే పరిస్థితి ఉండదు" అని అన్నారు. తెలుగు దేశం పార్టీలో ఇలాంటి వ్యక్తులు మరెంతమంది ఉన్నారో తెలుసుకోవడానికి సర్వే చేయాలని కూడా ఆయన సూచించారు. ఇటీవల ఎంఎస్ రాజు ఒక కార్యక్రమంలో "భగవద్గీత ప్రజల జీవితాలను మార్చలేకపోయింది" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో హిందూ సంఘాలు, భక్త సమాజం, రాజకీయ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో టీటీడీ బోర్డు సభ్యత్వంపై కూడా వివాదం చెలరేగింది. హిందూ సంస్థలు ఎంఎస్ రాజును బోర్డు నుంచి తొలగించాలంటూ డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలపై రాజ్యవ్యాప్తంగా తీవ్ర చర్చ నడుస్తోంది.

# తెలంగాణలో ఐఏఎస్ అధికారుల బదిలీలు

### సీఎస్ ఉత్తర్వులు జారీ




**హైదరాబాద్, అక్టోబర్ 31:**
రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలు చోటుచేసుకున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫ్లాగ్‌షిప్ అభివృద్ధి మరియు సంక్షేమ పథకాల అమలు విభాగానికి ప్రత్యేక సీఎస్‌గా ఉన్న సవ్యసాచి ఘోష్ బదిలీ అయ్యారు. ఆయనే సంక్షేమ శాఖ ప్రత్యేక సీఎస్‌గా కొనసాగనున్నారు. గిరిజన సంక్షేమ కార్యదర్శి, కమిషనర్‌గా ఉన్న అనితా రామచంద్రన్ కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ కమిషనర్‌గా ఇలంబర్తి బదిలీ అయ్యారు. అదనంగా పశు సంవర్ధక శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. మెట్రోపాలిటన్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి బాధ్యతలను సీఎస్ రామకృష్ణారావు వద్దే ఉంచారు. జనరల్ అడ్మినిస్ట్రేషన్ (జీఏడీ) కార్యదర్శిగా ఇ. శ్రీధర్ కు అదనపు బాధ్యతలు అప్పగించగా, టీజీ ఆయిల్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా యాస్మిన్ బాషా కొనసాగుతారు. ఎస్సీ అభివృద్ధి కమిషనర్‌గా జి. జితేందర్ రెడ్డి బదిలీ అయ్యారు. ఆయనకు ఎస్సీ సహకార సంస్థ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ బదిలీలతో రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి.

# సిద్దిపేటలో విషాదం..

### - ఆర్టీసీ బస్సు కింద పడి వ్యక్తి ఆత్మహత్య
### - పొన్నాల దాబా వద్ద మృతిచెందిన వ్యక్తి
#### - మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన బాలరాజుగా గుర్తింపు



**సిద్ధిపేట, అక్టోబర్ 31:**
సిద్ధిపేట జిల్లాలో శుక్రవారం ఉదయం హృదయ విదారక సంఘటన చోటుచేసుకుంది. పొన్నాల దాబా వద్ద ఆర్టీసీ బస్సు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనతో అక్కడి ప్రజల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడిని మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన బాలరాజుగా పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరా దృశ్యాల్లో బాలరాజు బస్సు ముందు నడుస్తూ వెళ్లి, ఒక్కసారిగా బస్సు ముందు చక్రాల కింద పడిన దృశ్యాలు కనిపించాయి. ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు డ్రైవర్ ఆపడానికి ప్రయత్నించినా, అప్పటికే ప్రమాదం జరిగిపోయింది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని, కుటుంబ సభ్యులను ప్రశ్నిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో స్థానికంగా దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది.

# పాకిస్థాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కుప్పకూలిన సూచీలు

- పెట్టుబడిదారుల భయాందోళనలలు
- ఆర్థిక, రాజకీయ అనిశ్చితి పెరగడంతో ఇన్వెస్టర్ల ఆందోళన
- ఆర్థిక వెసులుబాటు కు ఎదురుచూపులు





**తొవ్వ డెస్క్, అక్టోబర్ 31:**
పాకిస్థాన్ స్టాక్ మార్కెట్‌లో శుక్రవారం భారీ పతనం నమోదైంది. దేశంలో నెలకొన్న రాజకీయ అస్థిరత, తాలిబన్లతో పెరుగుతున్న ఉద్రిక్తతలు, కీలక కంపెనీల అంచనాలకు తగ్గ ఫలితాలు పెట్టుబడిదారులను భయపెట్టాయి. ఫలితంగా, బెంచ్‌మార్క్ కేఎస్‌ఈ-100 సూచీ ఏకంగా 1,600 పాయింట్లకు పైగా క్షీణించి 158,465 వద్ద ముగిసింది. మార్కెట్ పతనానికి ప్రధాన కారణాలుగా భద్రతా పరిస్థితుల విషమత, ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి, పెద్ద కంపెనీల లాభాల క్షీణతలను విశ్లేషకులు చూపుతున్నారు. ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులో తాలిబన్ల దాడులు, అంతర్గత రాజకీయ అస్థిరత పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. దీనివల్ల బ్యాంకింగ్, సిమెంట్, ఎనర్జీ రంగాల్లో షేర్ల విక్రయాలు విస్తరించాయి. ట్రేడింగ్‌లో మొత్తం 340 కంపెనీలు పాల్గొనగా, వాటిలో 233 నష్టాల్లో ముగిశాయి. కేవలం 93 కంపెనీలు లాభపడ్డాయి.లక్కీ సిమెంట్, యునైటెడ్ బ్యాంక్, ఎంసీబీ బ్యాంక్ వంటి బ్లూ-చిప్ స్టాక్స్ భారీగా పడిపోవడం మార్కెట్‌ను మరింత కిందికి లాగింది. అయితే, నేషనల్ బ్యాంక్ ఆఫ్ పాకిస్థాన్ మాత్రం కొంతమేర మద్దతు చూపింది. మొత్తం టర్నోవర్ 951 మిలియన్ షేర్లకు పడిపోయి, రూ.41.3 బిలియన్ల విలువగా నమోదైంది. ఈ పరిస్థితుల్లో కొత్త పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు వెనుకడుతున్నారు. ప్రభుత్వం విధానపరమైన స్థిరత్వం తీసుకువచ్చి, పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పున రుద్ధరించాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. అంతర్జాతీయ జర్నలిస్ట్ ఫెడరేషన్ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం, పాకిస్థాన్ జర్నలిస్టుల కు అత్యంత ప్రమాదకర దేశంగా మారిందని పేర్కొంది. ఈ పరిస్థితులు దేశంలో ప్రజాస్వామ్య, ఆర్థిక భవిష్యత్తుపై మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

## చాక్లెట్ ఆశ చూపి చిన్నారిపై దారుణ యత్నం

### ఇద్దరు కార్మికులు అరెస్టు

**చౌటుప్పల్, అక్టోబర్ 31:**



యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని లింగోజిగూడెం గ్రామంలో శుక్రవారం దారుణ ఘటన చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం స్థానిక రసాయన పరిశ్రమలో ఉద్యోగం చేస్తూ గ్రామంలోనే నివాసముంటోంది. శుక్రవారం ఉదయం తండ్రి పనికి వెళ్లగా, తల్లి ఇంటి బయట దుస్తులు శుభ్రం చేస్తుండగా, మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఆ కుటుంబంలోని నాలుగేళ్ల చిన్నారికి చాక్లెట్ ఆశ చూపి లైంగికదాడి యత్నం చేసినట్లు సమాచారం. వారు కూడా అదే పరిశ్రమలో రోజువారీ కూలీలుగా పనిచేస్తున్నారని పోలీసులు తెలిపారు.సంఘటన గమనించిన తల్లి, సమీపంలోని స్థానికులతో కలిసి వెంటనే ఆ ఇద్దరినీ అడ్డుకుని పోలీసులకు సమాచారమిచ్చింది. స్పందిం చిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభిం చారు. ఈ ఘటనతో గ్రామంలో ఆందోళన వ్యాప్తించింది. చిన్నారి సురక్షితంగా ఉందని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.

# నత్త నడకన కాంగ్రెస్ పాలన

**రైతుల ఇబ్బందులు కంటే ఎన్నికలే ముఖ్యమా...**

**గత ప్రభుత్వంలో ఇచ్చిన అన్ని పథకాలనీ బంద్ చేశారు**

**.కల్వల ప్రాజెక్టు పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**రైతుల పంట నష్టంపై తీవ్ర ఆవేదన**



**తొవ్వ,కరీంనగర్, అక్టోబర్ 31:**
రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన నత్త నడక కంటే అధ్వానంగా ఉందని, గత ప్రభుత్వంలో రైతుల సంక్షేమానికి ఏర్పాటుచేసిన నిధులు పథకాలను తుంగలో తొక్కారని, కేవలం ఎన్నికలు తప్ప మరే సంక్షేమం ప్రభుత్వానికి పట్టడం లేదని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు శుక్రవారంకరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం లోని కల్వల ప్రాజెక్టు పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమెకు జాగృతి కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో వెంట ఉన్నారు. ప్రాజెక్టు వైపు ప్రయాణిస్తుండగా మార్గమధ్యంలో ఏర్పడిన భారీ వర్షాల కారణంగా వరి పంటలు ముంచెత్తిన దృశ్యాలను చూసి కవిత ఆవేదన వ్యక్తం చేశారు. పలు ప్రాంతాల్లో నేల వాలిపోయి పంట పూర్తిగా నష్టపోయిన రైతులను కలసి వారి బాధలను విన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని వారిని ధైర్యం చెప్పారు.కల్వల మత్తడి మరమ్మతులపై మాట్లాడుతూ “శంకరపట్నం మండలంలోని కల్వల మత్తడి కొట్టుకుపోయి మూడు సంవత్సరాలు అవుతోంది. దీన్ని పునర్నిర్మించడానికి గత ప్రభుత్వం ఇప్పటికే రూ. 70 కోట్లు మంజూరు చేస్తూ జీవో కూడా జారీ చేసింది. కానీ ఇప్పటి వరకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. పునర్నిర్మాణ పనులు ప్రారంభం కానందువల్ల రైతులు ప్రతి సంవత్సరం నష్టాలను ఎదుర్కొంటున్నారు” అని అన్నారు. “ప్రాజెక్టు మత్తడి బాగు చేయకపోవడం వల్ల కరీంనగర్, జగిత్యాల పరిసర ప్రాంతాల పంటలు వర్షాల సమయంలో తీవ్ర నష్టానికి గురవుతున్నాయి. ప్రజల పన్నుల డబ్బుతో మంజూరైన నిధులు ఎక్కడ వినియోగమయ్యాయి? ఈ నిర్లక్ష్యం ఎవరిది?” అని ప్రశ్నించారు.కవిత రైతుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. “వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు తక్షణ ఆర్థిక సాయం అందించాలి. మత్తడి మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలి. రైతులు ఏడవకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత” అని అన్నారు.ఈ సందర్భంగా కవితతో కలిసి స్థానిక ప్రజలు తమ సమస్యలను తెలియజేసారు. కల్వల ప్రాజెక్టు పునరుద్ధరణకు ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకుంటేనే ప్రాంతీయ వ్యవసాయం కాపాడబడుతుందని ఆమె స్పష్టం చేశారు.ప్రాంతమంతా ఈ సందర్శనతో ఉత్సాహంగా మారగా, రైతులు తమ పట్ల కవిత చూపిన సానుభూతి, స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు.







# భారీ వర్షాల నష్టం

**- క్షేత్రస్థాయిలో సమగ్రమైన నివేదికలు ఇవ్వాలని సీఎం రేవంత్ ఆదేశం**

**- శాశ్వత పరిష్కారాల దిశగా ప్రభుత్వం కృషి - ఏరియల్ సర్వేతో నష్టపరిస్థితుల అవలోకనం - పంట నష్టంపై స్పష్టమైన ఆదేశాలు**

**- ఇళ్లు దెబ్బతిన్న వారికి సాయం.. - పేదలకు ఇందిరమ్మ ఇండ్లు**






**హనుమకొండ :**
రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం వాటిల్లిన జిల్లాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఏరియల్ సర్వే నిర్వహించారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో వర్షాల ధాటిని ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన, అనంతరం హనుమకొండలో వరద బాధితులను కలుసుకున్నారు. ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించి, ప్రజల సమస్యలను స్వయంగా విన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ “వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. నష్టపోయిన రైతులకు ఎకరాకు 10,000 చొప్పున పరిహారం అందించాల నుకుంటున్నాం” అన్నారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ?5 లక్షల చొప్పున సాయం అందించాలనే నిర్ణయం ఇప్పటికే తీసుకున్నామని గుర్తుచేశారు. అదనంగా పొలాల్లో ఇసుక మేట తొలగించేందుకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులను వినియోగించాలన్నారు. వరదలతో ఇండ్లు దెబ్బతిన్న వారికి 15,000 చొప్పున తక్షణ సాయం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశం చారు. అత్యంత నిరుపేద కుటుంబాలకు ఇందిర మ్మ ఇండ్లను కేటాయించాలని సూచించారు. నిరాశ్రయులైన వారి జాబితాలను కలెక్టర్లు సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపాలని తెలిపారు. ప్రతి జిల్లాలో ప్రాణ, ఆస్తి, పంట, పశు నష్టం, రోడ్లు, కల్వర్టులు, మౌలిక సదుపాయాల నష్టంపై విపత్తు నిర్వహణ విభాగం ఫార్మేట్ ప్రకారం నివేదికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఈ వివరాల ఆధారంగా కేంద్ర సహాయం పొందేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. వర్షాల సమయంలో తాత్కాలిక చర్యలకు మాత్రమే కాకుండా శాశ్వత పరిష్కారాలకు కృషి చేయాలి. డ్రైనేజీ, నీటి పారుదల వ్యవస్థల్లో అడ్డంకులు తొలగించాలి. నాలాలను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి” అని సీఎం హెచ్చరించారు. విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే నష్టం ఎక్కువగా జరుగుతోందని వ్యాఖ్యానించారు. వాతావరణ మార్పుల కారణంగా భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు మళ్లీ రాకుండా సమగ్ర ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి హితవు పలికారు. “క్లౌడ్ బరస్ట్ అయిపోయిందన్న నిర్లక్ష్యం వద్దు. గత ఏడాది కూడా ఇలాంటి వర్షాలు వచ్చాయి. శాశ్వత చర్యలు తీసుకోవాలి” అని స్పష్టం చేశారు. “వారం రోజుల్లో అన్ని జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు సమర్పించాలి. ఎవరు నిర్లక్ష్యం వహించినా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుంది” అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. బాధితులను ఆదుకోవడంలో బాగా పనిచేసిన అధికారులను ఆయన అభినందించారు.



## బాధితులందరికీ న్యాయం చేయాలి

**- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశం**



**కాకినాడ :** మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ స్వాంతన కలిగించి, న్యాయం చేయాలని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పంట నష్టం, ఆస్తి నష్టం అంచనాలను పకడ్బందీగా రూపొందించి, ప్రభుత్వం ప్రకటించిన సాయం ఎవరూ మినహాయించబడకుండా అందేలా చూడాలని ఆయన అధికారు లను ఆదేశించారు.పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని తీర ప్రాంత గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారు. సముద్రానికి ఆనుకుని ఉన్న మత్స్యకార గ్రామాల పరిస్థితులపై నిరంతరం నివేదికలు పంపాలని ఆయన ఆదేశించారు. శుక్రవారం డిప్యూటీ సీఎం కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ, డీఆర్ఓ, ఆర్డీవోలు, పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, వ్యవసాయ, విద్యుత్ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తుపాను అనంతర పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. కాకినాడ జిల్లా పరిధిలో మొంథా తుపాను ప్రభావంతో జరిగిన నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు.కలెక్టర్ షాన్ మోహన్ వివరాల ప్రకారం, కాకినాడ జిల్లా పరిధిలో మొత్తం 21 మండలాలు, ఏడు మున్సిపాలిటీలు మొంథా తుపానుతో ప్రభావితం అయ్యాయి. మొత్తం 61 ఇళ్లు దెబ్బతిన్నాయి. 41,932 కుటుంబాలు ప్రభావితమయ్యాయి. అందులో 27,624 మత్స్యకార, 313 చేనేత కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. 21,711 హెక్టార్లలో పంటలకు నష్టం జరిగిందని, 668 ఎకరాల్లో అరటి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. మొత్తం 33,596 మంది రైతులు తుపాను కారణంగా నష్టపోయారని చెప్పారు. విద్యుత్ పరికరాలు, రోడ్లు కూడా పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని వివరించారు. ఒక్క పిఠాపురంలోనే 2,500 మంది రైతులు పంట నష్టాన్ని ఎదుర్కొన్నారని చెప్పారు. అంతటా ఉపశమన చర్యలు కొనసాగుతున్నాయని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, “పంట చేతికి వచ్చే సమయానికే తుపాను తాకింది. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి రాలేదు. ప్రతి నష్టపోయిన రైతుకీ ప్రభుత్వం నుంచి పరిహారం తప్పనిసరిగా అందాలి. కష్టంలో ప్రభుత్వం మాకు తోడుందని రైతు సంతృప్తి చెందేలా యంత్రాంగం చర్యలు ఉండాలి” అని అన్నారు. పంట నష్టం అంచనాలు రూపొందించే సమయంలో రైతుల పక్షాన నిలబడి, పక్కా నివేదికలు తయారు చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఆస్తి నష్టాలను కూడా వివరంగా నమోదు చేసి, దెబ్బతిన్న ఇళ్లకు వెంటనే పరిహారం చెల్లించాలని సూచించారు. తుపాను అనంతరం గ్రామాల్లో నిల్వ నీరు తొలగించే పనులు వేగంగా పూర్తి చేయాలని, పల్లపు ప్రాంతాల్లో మళ్లీ వర్షాల సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పారిశుధ్య కార్యక్రమాల పురోగతిపై గ్రామాల వారీగా నివేదికలు సమర్పించాలని, రోడ్లు దెబ్బతిన్న చోట తక్షణ మరమ్మతులు చేపట్టాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

## వర్షంతో భారీగా దెబ్బతిన్న రోడ్లు


**త్వరగా మరమ్మతులు చేయాలని కోరుతున్న వాహనదారులు**



**సైదాపూర్, అక్టోబరు 31:**
మండలంలో రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి రోడ్లు దెబ్బతిన్నాయి. నాల్ చెరువు మత్తడి వరద రోడ్డుపైనుంచి ప్రవహించడంతో హుస్నాబాద్–హుజూరాబాద్ ప్రధాన రహదారి సమ్మక్క గుట్ట నుంచి సైదాపూర్ వరకు దెబ్బతిన్నది. తారు రోడ్డు కింది మట్టి కొట్టుకపోయి రోడ్డు మధ్య పెద్ద గుంత ఏర్పడింది. స్థానికులు ప్రమాదాలు జరుగకుండా ఆ గుంతలో చెట్ల కొమ్మలు వేశారు. సైదాపూర్ సమీపంలో లో లెవల్ వంతెనగుం తలమయంగా మారింది. సోమారం గ్రామ సమీపంలోని వాగు పొంగి సైదాపూర్–మొలంగూర్ రోడ్డులో సోమారం చౌరస్తా రోడ్డు కొట్టుకుపోయింది. ఎక్లాస్‌పూర్–సోమారం రోడ్డు వరద దాటికి కొట్టుకపోయి ప్రమాదకరంగా మారింది. సోమారం–బూడిదపల్లి వైపు రోడ్డు తారు కొట్టుకుపోయి కంకర తెలింది. ఆకునూర్–గొల్లగూడెం మధ్య రోడ్డుకు గండి పడింది. ఆకునూర్ గ్రామంలో వరదకు మంచి నీటి పైప్‌లైన్ కొట్టుకపోవడంతో అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. గై చెరువు మత్తడితో ఆరెపల్లి–జాగీర్‌పల్లి మధ్య రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ఎలబోతారం–బొమ్మకల్ మధ్య రెండు లోలేవల్ వంతెనలపై నుంచి నీరు పోయి గుంతలు ఏర్పడ్డాయి. మండలంలోని ఇందుర్తి ఎల్లమ్మ వాగు వద్ద వర్షానికి రోడ్డు దెబ్బ తిని రాక పోకలు నిలిచిపోయాయి. శుక్రవారం కొందరు ప్రయాణికులు రోడుకు మరమ్మతులు చేశారు. దీంతో ప్రస్తుతం కోహెడ– చిగురుమామిడి మండలాల ప్రజల రాకపోకలు సాగుతున్నాయి.



## మీనాక్షి చౌదరి ట్రావెల్ డైరీ స్పెషల్..



ఎ ఇచట వాహనములు నిలుపరాదు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది హర్యానా సుందరి మీనాక్షి చౌదరి. ఆ తర్వాత హిట్ 2, గుంటూరు కారం సినిమాలతో హిట్స్‌ను ఖాతాలో వేసుకుంది. గతేడాది మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన లక్కీ భాస్కర్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించింది. ఎప్పుడూ ఏదో ఒక ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌తో ఫుల్ బిజీగా ఉండే ఈ భామ కాస్త బ్రేక్ తీసుకొని వెకేషన్ టూర్ ప్లాన్ చేసుకుంది. ఇంతకీ మీనాక్షి చౌదరి ఎక్కడికెళ్లిందనుకుంటున్నారా..? ఈ భామ జపాన్ దేశానికి టూర్ వేసింది. స్టైలిష్ డ్రెస్‌లో ఉన్న మీనాక్షి జపాన్ వీధుల్లో వర్షం పడుతుంటే గొడుగు పట్టుకొని మాన్‌సూన్ అందాలను ఆస్వాదించింది. ఈ ఫొటోలపై మీరూ ఓ లుక్కేయండి మరి. ఓ వైపు ధమక్కుమని మెరుస్తున్న చెవిపోగులు, మరోవైపు సాధారణ పోనీటైల్ లాంటి జుట్టుతో ఉన్న ఈ చిన్నది అందమైన చిరునవ్వుతో అందరినీ ఆకర్షిస్తోంది. ప్రతీ వీధిలో మీనాక్షి చౌదరి దిగిన ఫొటోలు జపాన్ టూర్‌ను ఎలా ఎంజాయ్ చేసిందో చెప్పకనే చెబుతున్నాయి. జపాన్ వెకేషన్‌లోని ప్రతీ ఫ్రేమ్ తన ట్రావెల్ డైరీలో ప్రత్యేకంగా నిలిచిపోయేలా కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. 'కొన్ని యాదృచ్ఛిక విషయాలు, సంఘటనలు మనలో శాశ్వత ముద్ర వేస్తాయి. ఈ అద్భుతమైన రోజు నుండి నాకు అలాంటి ఒక జ్ఞాపకం లభించినందుకు నేను కృతజ్ఞురాలినని భావిస్తున్నాను. జపాన్‌లో మేము ఒక అందమైన కేఫ్‌ను గుర్తించాం. అద్భుతమైన వర్షాభావ దృశ్యాల నుండి అక్కడి అందమైన మనుషులతో అందంగా తయారు చేసిన జపనీస్ టీ వరకు అన్నీ ఆస్వాదించాం' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో క్యాప్షన్ పెట్టింది. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న మీనాక్షి చౌదరి. ప్రస్తుతం అనగనగా ఒక రాజు సినిమాలో నటిస్తోంది.


## అనుదీప్‌తో సినిమా చేస్తున్నా..

### కామెడీ చేయడం చాలా కష్టమైన పని : కయాదు లోహర్

శ్రీవిష్ణు నటించిన అల్లూరి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది అస్సామీ సుందరి కయాదు లోహర్ ఈ ఏడాది ప్రదీప్ రంగనాథన్ నటించిన డ్రాగన్ మూవీతో కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ ముద్దుగుమ్మ జాతిరత్నాలు డైరెక్టర్ అనుదీప్‌తో సినిమా చేస్తుందట. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో షేర్ చేసుకుంది. అంతేకాదు కామెడీ చేయడం ఎంత కష్టమో చెప్పింది కయాదు లోహర్. నేను అనుదీప్ డైరెక్షన్‌లో వస్తోన్న ఓ సినిమాలో నటిస్తున్నా. ఈ మూవీ పూర్తిగా కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. సినిమాలోని చాలా డైలాగ్స్ షూటింగ్ స్పాట్‌లో ఆలోచించి రాసినవే. ప్రతీ ఐదు నిమిషాలకోసారి వచ్చే సీన్ కొత్తగా చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుందంటూ చెప్పుకొచ్చింది కయాదు లోహర్. కామెడీ చేయడం చాలా కష్టమైన పని. ఎందుకంటే నేను అనుదీప్ సార్‌తో ఓ సినిమా చేస్తున్నా. కామెడీ చాలా కష్టమని తెలుసుకున్నా. ఎందుకో నాకు తెలియదు కానీ దానికి భాష కూడా ముఖ్యమే. మీకు భాష తెలిసినప్పుడు దాని అర్థమేంటో.. ఆ సంస్కృతి ఏంటో మీకు తెలుస్తుంది. తద్వారా కామెడీ కూడా సహజంగానే వస్తుంది. సంస్కృతితోపాటు ప్రేక్షకుల నాడి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. నాకు నవ్వించే స్వభావం ఉందని నమ్ముతా. కానీ కామెడీ చేయాల్సి వస్తే మాత్రం అది చాలా కష్టమైన పని. అది షూటింగ్ చేసేటప్పుడు చాలా చాలా కష్టంగా ఉంటుంది. ప్రతీ పంచ్ సరిగ్గా వేయాలి.. ప్రతీ టేక్‌ను సరైన విధంగా వచ్చేలా చూసుకోవాలి. కామెడీ అనేది స్క్రిప్ట్‌పై ఆధారపడే కాకుండా స్పాట్‌లో ఆయన (అనుదీప్)చాలా డైలాగ్స్‌తో రాస్తుంటారు. నాకు ఒక డైలాగ్ ఉందంటే మళ్లీ ఐదు నిమిషాల తర్వాత మరో డైలాగ్ వస్తుంటుంది. ఈ సంభాషణలు, కామెడీ ప్రతీ సారి కొత్తగా మారుతూనే ఉంటాయి. ఒక నా భాష (అస్సామీ)లో కామెడీ చేస్తే అంత కష్టం కాదు. కానీ వేరే భాషలో చేయాలంటే చాలా కష్టం అంటూ చెప్పుకొచ్చింది కయాదు లోహర్. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇంతకీ అనుదీప్ కయాదు లోహర్‌ను ఎలా చూపించబోతున్నాడన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. కయాదు లోహర్ 2021లో ముగిల్‌పేట అనే కన్నడ మూవీతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మలయాళంలో పాథోన్‌పథం నూట్టుండు సినిమాలో నటించిన ఈ బ్యూటీ అనంతరం శ్రీ విష్ణు సరసన 'అల్లూరి' చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. మరోవైపు మరాఠీలో కూడా నటించింది.

## నాగార్జున 100వ సినిమా డైరెక్టర్ ఇతడే..

### అప్పుడే రిలీజ్ ప్లాన్ కూడా..?



ఈ ఏడాది కుబేర, కూలీ సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగార్జున. నాగ్ ఇటీవలే కూలీ సినిమాతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన విషయం తెలిసిందే. ఇక నాగార్జున కెరీర్‌లో ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోయే 100వ ప్రాజెక్ట్‌పై కొత్త అప్‌డేట్ ఎప్పుడెప్పుడొస్తుందా..? అని మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వారి కోసం నాగ్ వందో సినిమాకు సంబంధించిన క్రేజీ వార్త ఒకటి తెరపైకి వచ్చింది. ఈ చిత్రాన్ని తమిళ దర్శకుడు రా కార్తీక్ డైరెక్ట్ చేయబోతున్నాడట. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన చేయబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ మూవీని నాగార్జున 2026 మే నెలలో సమ్మర్ కానుకగా అభిమానుల ముందుకు తీసుకురావాలని ఫిక్స్ అయినట్టు సమాచారం.

## చారిత్రక ప్రదేశాల్లో ఇమాన్వీ షికారు

తొలిసారి సిల్వర్ స్క్రీన్‌పై కనిపించడమంటే ఎవరికైనా చాలా ప్రత్యేక విషయమనే చెప్పాలి. అందులోనా మొదటిసారే పాన్ ఇండియాతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఫాలోవర్లున్న ప్రభాస్ లాంటి స్టార్ హీరోతో నటించే అవకాశం వస్తే ఎలా ఉంటుందో మాటల్లో చెప్పలేం. అలాంటి అవకాశాన్నే కొట్టేసి ఓవర్‌నైట్ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది ఇమాన్వీ. హను రాఘవపూడి డైరెక్షన్‌లో ప్రభాస్ నటిస్తోన్న ఫౌజీ సినిమాలో ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తుందని తెలిసిందే. ఈ భామ నెట్టింట ఎలాంటి అప్‌డేట్ షేర్ చేస్తుందా అని ఎదురుచూస్తున్న ఫాలోవర్ల కోసం కొన్ని ఫొటోలు హల్ చల్ చేస్తున్నాయి. ఈ భామ ప్రస్తుతం హైదరాబాద్‌లో షికారు చేస్తోంది. ఫ్లోరల్ పంజాబీ డ్రెస్‌లో స్టైలిష్ గాగుల్స్ పెట్టుకున్న ఇమాన్వీ నగరంలోని చారిత్రక ప్రదేశాల్లో (సమాధులు) సరదాగా చక్కర్లు కొట్టింది. చారిత్రక కట్టడాల ముందు నిలబడి కెమెరాకు ఫోజులిచ్చింది. ఇప్పుడీ ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. చాలా రోజులుగా ఇలా నెట్టింట కనిపించిన ఇమాన్వీ మరి ఫౌజీకి సంబంధించిన ఏమైనా అప్‌డేట్ ఇస్తుందా..? అంటూ ఎదురుచూస్తున్నారు ఫాలోవర్లు, నెటిజన్లు.



Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

# రైతులు అధైర్యపడవద్దు ఆదుకుంటాం

## దెబ్బతిన్న పంటలు, కల్వర్టులు, రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే

## నష్టపరిహారం అంచనా వేయాలని అధికారులకు ఆదేశం

### ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్



తొవ్వ, నెల్లికుదురు, అక్టోబర్ 31

మెంతా తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతాంగం అధైర్య పడవద్దని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని రైతులకు భరోసా కల్పించారు శుక్రవారంఅధికారులను వెంటబెట్టుకొని స్థానిక నేతలతో కలిసి మండలంలోని హనుమాన్ నగర్ తండా , రాజుల కొత్తపల్లి, నల్లగుట్ట తండా, రతిరాం తండా, బ్రాహ్మణ కొత్తపల్లి, శ్రీరామగిరి గ్రామాలను పంట పొలాలను,రహదారి వద్ద వర్షపు నీరు రోడ్డు మీదుగా ప్రవహిస్తూ రాకపోకలకు అంతరాయం కలిగించడంతో వారు స్వయంగా అక్కడికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు..ఎమ్మెల్యే రోడ్డు పరిస్థితిని సమీక్షించి, అధికారులతో మాట్లాడి నీరు తగ్గే వరకు ఆ మార్గంలో వాహన రాకపోకలను నిలిపివేయాలని సూచించారు. ప్రజలు ప్రమాదాలను నివారించేందుకు అప్రమత్తంగా ఉండాలని, అవసరం ఉంటే మాత్రమే బయటకు రావాలని విజ్ఞప్తి చేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా మురళీ నాయక్ గారుమొంథ తుఫాన్ ప్రభావంతో మన నియోజకవర్గంలో పలు ప్రాంతాలు నీటమునిగాయి. ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యం. అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండి పర్యవేక్షణ చేయాలి. ఎక్కడైనా రోడ్లు తెగిపోయినా, చెరువులు పొంగిపోయినా వెంటనే రిపోర్ట్ ఇవ్వాలి. ప్రజలు భయపడకుండా, అయితే అప్రమత్తంగా ఉండాలి. వర్షాల తీవ్రత తగ్గే వరకు ఇళ్లలోనే ఉండి సురక్షితంగా ఉండాలని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను అని తెలిపారు..అదే విధంగా వర్షాల కారణంగా రైతులు, విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డులు, గ్రామీణ రహదారుల వద్ద నీరు నిల్వ కాకుండా చూడాలని సూచించారు..తన పర్యటనలో ఎమ్మెల్యే తో పాటు తహసీల్దార్ చందా నరేష్, ఎంపీడీవో సింగారం కుమార్, రోడ్లు %�ڈ% భవనాల శాఖ ఇంజనీర్లు, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాసం లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులు బాలాజీ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి కుంట్ల మౌనేందర్, మండల నాయకులు జల్లా వెంకటేష్, ఆకుతోట సతీష్, గుగులోత్ భాస్కర్, , మండల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు,స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు..

# మొంథా తుఫాన్ వాళ్ళ నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

## నష్టపరిహారం వెంటనే చెల్లించాలి సిపిఐ డిమాండ్



యాదాద్రి జిల్లా :భువనగిరి: తొవ్వ ప్రతినిధి బీఅక్టోబర్ 31

అక్టోబర్ 28 , 29 తేదీలలో రాష్ట్ర స్థాయిలో కురిసిన అకాల వర్షాలకు యాదాద్రి భువనగిరి జిల్లాలో పలు మండలాలలో తీవ్రంగా పంట నష్టం జరిగింది.క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు నష్టపరిహారాన్ని అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలి.నష్టపోయిన రైతులకు వరి పంటకు ఎకరానికి 30000 పత్తి పంటకు ఎకరానికి 50,000 నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో దామోదర్ రెడ్డి మాట్లాడుతూ పలు మండలాలలో తీవ్రంగా దెబ్బతిన్న రోడ్లను మరియు కల్వర్టులను పూర్తిస్థాయిలో మరమ్మత్తులు సంబంధిత అధికారులు పర్యవేక్షించి వెంటనే మరమ్మతులు చేపట్టి రవాణా సౌకర్యలు మెరుగు పరిచి ప్రజలకు సౌకర్యముగా ఇబ్బంది లేకుండా చూడాలని డిమాండ్ చేసినారు. అట్లాగే ఐకెపి సెంటర్లలో %ఖాజా% లో మార్కెట్ యార్డుల్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని %జ జ అ% ద్వారా ఎలాంటి షరతులు లేకుండా పత్తి కొనుగోలు వరి కొనుగోలును వెంటనే కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేసినారు అట్లాగే నష్టపోయిన రైతులు సంబంధిత అధికారులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్ భువనగిరి పట్టణ సిపిఐ కార్యదర్శి పుట్ట రమేష్, నాయకులు శోభన్ బాబు, వసంత, ముంతాజ్, బీరకాయల గణేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# 106 సంవత్సరాలుగా కార్మికులకు అండగా ఏఐటీయూసీ జెండా

- కార్పొరేట్ మోడీని గద్దె దించండి
- ఏఐటీయూసీ జెండా ఎగురవేసిన జిల్లా అధ్యక్షులు బి.అజయ్ సారథి




తొవ్వ, మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 31:

106 సంవత్సరాలుగా కార్మికులకు అండగా ఏఐటీయూసీ జెండా నిలిచిందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బి.అజయ్ సారథి అన్నారు. శుక్రవారం ఘనంగా ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. బాణాసంచా కాల్చి కేక్ కట్ చేసి ఏఐటీయూసీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా అజయ్ సారథి , రేషపల్లి నవీన్ లు మాట్లాడుతూ... ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రంలోని సిటీ లారీ ట్రాన్స్పోర్ట్ హమాలీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ దేశంలో స్వాతంత్రానికి పూర్వం ఆవిర్భవించి నాటి నుంచి నేటి వరకు కార్మికుల పక్షాన పోరాటం చేసిన ఏకైక సంఘం అన్నారు. ఈ దేశంలో కార్మికులకు ఉద్యోగ భద్రత, అసంఘటిత కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం కావాలని పోరాటం చేసింది ఏఐటీయూసీ అన్నారు. దేశంలో ఒకవైపు మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్ లుగా చేస్తే దేశవ్యాప్తంగా అనేక సమ్మెలు నిర్వహించి దేశ కార్మికులను ఏకం చేసిన సంఘం ఏఐటీయూసీ అన్నారు. ఒకవైపు మోడీ, ఆదాని, అంబానీ లకే ప్రభుత్వ రంగ సంస్థలు అప్పజెప్పడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామన్నారు. ఎల్ఐసి ని ఇటీవల ఆదాని కోసం వేల కోట్ల రూపాయలు అప్పజెప్పడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమం ఉప్పొంగుతుందని, రానున్న కాలంలో కార్మికుల చేతుల్లో మోడీ పతనం తప్పదన్నారు. మానుకోట జిల్లా కేంద్రంలో కార్మికులకు అండగా అనేక పోరాటాలు చేశామన్నారు. అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, సెకండ్ ఏఎన్ఎంలు, వీధి వ్యాపారస్తులు, భవన నిర్మాణ కార్మికులు, రిక్షా కార్మికులు, సిటీ ట్రాన్స్పోర్ట్ హమాలీ కార్మికులు మొదలైన కార్మికుల కోసం యాజమాన్యాలతో మాట్లాడి రేట్లు పెంచి కార్మికుల పక్షాన నిలబడ్డామన్నారు. ఎఐటియుసి ఉద్యమాలకు ఆకర్షితులై అనేక సంఘాలు ఏఐటీయూసీ లో చేరుతున్నారన్నారు. మానుకోట ప్రాంతంలో వీధి వ్యాపారుల కోసం అడ్డాలు కాపాడడం కోసం అనేక ఉద్యమాలు చేశామన్నారు. పండ్ల వ్యాపారులు గుంచి వ్యాపారుల కోసం నిరంతర పోరాటాలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రానున్న కాలంలో కార్మికుల పక్షాన పోరాటం చేస్తామని కార్పొరేటీకరణ చేస్తున్న మోడీ పతనం 2029 ఎన్నికల్లో తప్పదని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నేతలు మందశంకర్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, వంకాయలపాటి జకరయ్య, పెరుగు కుమార్, బానోతు లింగ్యానాయక్, జలగం ప్రవీణ్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, రాము, సోమయ్య, ముత్యాలు, రాములు, కిషన్, నారాయణ, రమణ, మధు, విజయ్, నాగేశ్వరరావు, పాషా, యూసుఫ్, వీరన్న, శేఖర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజానాట్యమండలి కళారూపాలు ప్రజల పక్షాన నిలిచే పోరాట ఆయుధాలు

## ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు



యాదాద్రి జిల్లా బీవలిగొండ: తొవ్వ ప్రతినిధి :అక్టోబర్ 31

ప్రజానాట్యమండలి కళారూపాలు ప్రజల పక్షాన నిత్యం పోరాడే పోరాట ఆయుధాలని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు అన్నారు. సంగెం గ్రామంలో నవంబర్ 9,10 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రజానాట్యమండలి జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు జయప్రదం చేయాలని కరపత్రం ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ అలంబించే ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజానాట్యమండలి గత కాలం నుండి కళారూపాల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తుంది.అదే స్ఫూర్తితో నేడు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల మీద ప్రజలపై ప్రభుత్వాలు మోపే భారాల మీద ప్రజానాట్యమండలి గొంతు విప్పుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యులు దేశపాక రవి మండల అధ్యక్షులు రుద్రపల్లి రామలింగం,ఈర్ల రమేష్ డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు ధ్యానబోయిన యాదగిరి,కవిడే సురేష్ లు తదితరులు పాల్గొన్నారు

# 20 సూత్రాల పథకంతో పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసిన నేత ఇందిరాగాంధీ

## కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్



తొవ్వ, నెల్లికుదురు, అక్టోబర్ 31

భారతదేశం కోసం ప్రాణాలను సైతం ప్రాణంగా పెట్టి పేద ప్రజల గుండెల్లో వెలుగులు నింపే లక్ష్యంతో నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ 20 సూత్రాల పథకం ప్రవేశపెట్టి బడుగు బలహీన వర్గాల్లో చెరగని ముద్ర వేశారని కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక విశ్రాంతి భవనంలో మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ వర్ధంతిని మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గుగులోతు బాలాజీ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి కుంట్ల మౌనేందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మద్ది రాజేష్ పటేల్ లతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం వారు మాట్లాడుతూ శ్రీమతి ఇందిరాగాంధీ సేవా నిరతి, దేశభక్తి, నీ కాంగ్రెస్ కార్యకర్తలు ఆదర్శంగా తీసుకొని పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలి అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఇందిరమ్మ రాజ్య స్థాపన కోసం కృషి చేస్తున్నారన్నారు. ఆమె ఆశయ సాధన కోసం అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రత్నపురం యాకయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుగులోతు భాస్కర్ నాయక్, పిఎసిఎస్ డైరెక్టర్ బెల్లి నరసయ్య, పార్టీ ఉపాధ్యక్షులు గూగులోతు కిషన్ నాయక్, నాయకులు వారి పల్లి ఉప్పలయ్య, దాసరి ప్రకాష్, ఆకుల కొమురెల్లి, రాము నాయక్, మాదరి ప్రశాంత్, సురేష్ నాయక్, ఆయా గ్రామాల నేతలు కార్యకర్తలు తదితరులున్నారు.

# భారత్ ఐక్యతకు ప్రతీక పటేల్

## ఇన్చార్జి ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్
## ఘనంగా సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు




తొవ్వ, నెల్లికుదురు, అక్టోబర్ 31
స్వాతంత్ర్యం అనంతరం భారత్ ఐక్యతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రతీక అని ప్రభుత్వ జూనియర్ కళాశాల నెల్లికుదురు ఇన్చార్జి ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నెల్లికుదురు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మర్సకట్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో భారత ఏకీకరణ శిల్పి, "ఇనుప మనిషి"గా ప్రసిద్ధి చెందిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ మర్సకట్ల అనిల్ కుమార్ లు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం భారతదేశాన్ని ఏకీకృతం చేయడం ద్వారా ఆయన భారత చరిత్రలో అమరుడైన నాయకుడిగా నిలిచారని తెలిపారు. 562 సంస్థానాలను భారత గణరాజ్యంలో విలీనం చేయడం ఆయన ధైర్యసాహసానికి ప్రతీకని అన్నారు. జాతీయ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నాడు. 1928లో బార్డోలీలో బ్రిటీష్ ఇండియా ప్రభుత్వం విధించిన పన్నులకు వ్యతిరేకంగా కిసాన్ ఉద్యమం చేపట్టి విజయవంతంగా నడిపించి, దేశ ప్రజల దృష్టిని ఆకర్షించాడని, తర్వాత పటేల్ కి సర్దార్ అనే బిరుదు వచ్చిందని అన్నారు. విదేశీ వస్త్ర బహిష్కరణ, గుజరాత్‌లో మద్యపానం, అస్పృశ్యత, కులవిచక్షణలకు వ్యతిరేకంగా పటేల్ పనిచేసారన్నారు. 1931 కరాచి భారత జాతీయ కాంగ్రెస్ సదస్సుకు అధ్యక్షుడిగా ఎన్నికై. ఉప్పు సత్యాగ్రహం, 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమం మొదలగు ఉద్యమాలలో కూడా ప్రముఖ పాత్ర వహించాడని అన్నారు. సర్దార్ పటేల్ జీవితం, ఆయన దేశభక్తి, పట్టుదల, నాయకత్వ గుణాలను విశదీకరించారు. అదేవిధంగా పటేల్ చూపిన మార్గం ఐక్యత, క్రమశిక్షణ, సేవా తత్పరత వంటి గుణాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రకాష్ బాబు, కవిరాజు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సుధాకర్, బాబు, మహేందర్, యాకన్న, సతీష్, సుభాష్ అధ్యాపకేతర బృందం ప్రదీప్, లక్ష్మణ్, గౌరీ శంకర్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# మోంతా తుఫాన్ తుఫాను వల్ల నీట మునిగిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

## - ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న



**తొవ్వ, మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 31:**
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ముందు అఖిలభారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ మహబూబాబాద్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు బండారి ఐలయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా అఖిల భారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అక్టోబర్ 29, 30 తేదీలలో కురిసిన మోంతా తుఫాన్ రెండు తెలుగు రాష్ట్రాలలో జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. వాగులు, వంకలు పొంగి పొర్లడం వలన రోడ్లు తెగి పోయాయి. వంతెనలు కొట్టుకపోయాయి. రవాణా వ్యవస్థ ధ్వంసం అయిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇండ్లలోకి రెండు నుంచి ఐదు ఫీట్ల లోతుతో నీరు నిలిచింది. దీని వలన మన మహబూబాబాద్ జిల్లాల లోని 18 మండలాలలో వరి పంట 16,377 ఎకరాలు, పత్తి పంట 782 ఎకరాలు, మిర్చి తోటలు 565 ఎకరాలు నీట మునిగినట్టుగా ప్రాథమిక అంచనాలలో తేలింది. సమగ్ర సర్వే చేస్తే ఇంకా అదనంగా ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉంది. రైలు, రోడ్డు మార్గాలు రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. మోంతా తుఫాన్ ప్రధానంగా రైతాంగాన్ని తీవ్రమైన సంక్షోభంలో పడవేసింది. మొక్కజొన్న తడిసి నాణ్యత కోల్పోయింది. పత్తి పంట ఏరటానికి రాకుండా పంట చేలలోని తడిసి నల్లగా మారి మొలకెత్తే పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు అనావృష్టి, మరోవైపు తీవ్రమైన మోంతా తుఫాన్ రైతులను కోలుకోలేని దెబ్బ కొట్టింది. అంచనా వేయటానికి క్షేత్రస్థాయిలో బృందాలను ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన నష్ట నివారణ చర్యలు చేపట్టాలి. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా పంటల బీమా లేకపోవడం వలన పూర్తిగా నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందజేయాలి.వరికి ఎకరం ఒక్క ఒక్కంటికి రూపాయలు 30000, పత్తికి 50,000, మిరప తోటలకు ఎకరానికి 50,000 వేలు చొప్పుననష్టపరిహారం అందించాలి. తేమతో సంబంధం లేకుండా మార్కెట్కు వచ్చిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ఇసుక మేటలు పెట్టిన భూములను చదును చేసి సేద్యానికి అనుకూలంగా తయారు చేయటానికి ఖర్చు అంచనా వేసి ప్రభుత్వం నష్ట పోయిన వారికి పరిహారం అందించాలి. వరదలలో కొట్టుకపోయి మరణించిన కోళ్లు, గొర్లు, పశువులకు అంచనా కట్టి తగిన విధంగా నష్టపరిహారం అందజేయాలి. రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలి. తెగిపోయిన రోడ్లను మరమ్మత్తులు చేయాలి. నీటి ప్రవాహానికి కొట్టుకపోయినలో లెవెల్ వంతెనల స్థానంలో హై లెవెల్ వంతెనలను ఏర్పాటు చేయాలి. చనిపోయిన వారికి 25 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.కనీస మద్దతు ధర ఎంఎస్పి ప్రకారం పత్తికి ఒక క్వింటాల్ కు పదివేల 75 రూపాయలు, మొక్కజొన్నకు ఒక క్వింటాలుకు 29 28, వరికి 315 రూపాయలు చొప్పున ధరలు చెల్లించాలి. రైతులు అమ్మిన సరుకులకు మూడు రోజుల వ్యవధిలో డబ్బులు చెల్లించాలి. అని పలు డిమాండ్లతో వారు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మోకాళ్ళ మురళీకృష్ణ,ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శులు జి సక్రు, యాకన్న, చింతా వెంకన్న, పూణెం భిక్షం, కొమురెల్లి సోమిరెడ్డి, దేవ బంగు భిక్షం, రామచంద్రుని మురళి చారి, హరీష్, నేతకాని రాకేష్, ఏపూరి వీరభద్రం, బొమ్మగాని వెంకన్న, నెల్లుట్ల ప్రసాద్ దేశెట్టి రవి మింగు భగవాన్ గుండెబోయిన లింగమల్లు, మాలోతి వీరన్న, రవి, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన మార్గంలో యువతీ,యువకులు ముందుకు సాగాలి

## సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడు, ఐక్యమత్యంతో ఏదైనా సాధ్యం అవుతుంది.

## - మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్



తొవ్వ, మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 31:
రన్ ఫర్ యూనిటీ 2కె-25, కార్యక్రమంలో యువతీ, యువకులతో జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ, జయంతి పురస్కరించుకుని మహబూబాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ యూనిటీ, 2కె రన్ ను "జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో," లు జెండా ఊపి రన్ ప్రారంభించారు.నెహ్రూ సెంటర్, జనరల్ హాస్పిటల్, ఎన్టీఆర్ స్టేడియం వరకు కొనసాగిన ఈ రన్ లో జిల్లా కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్, డీఎస్పీలు, పోలీస్ యంత్రాంగం, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు, స్థానిక యువతీ, యువకులు, వాకర్స్, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో ర్యాలీలో పాల్గొన్న వారితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ... సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన మార్గంలో యువతి, యువకులు, ప్రతి ఒక్కరూ ఐక్యతగా ఉండి ప్రయాణిస్తే మెరుగైన సమాజం నిర్మాణం కోసం మరింత కృషి చేసినట్లు అవుతుందని అన్నారు. ఆయన ఐడియాలజీ, యూనిటీని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో ముందుకు సాగాలని సూచించారు.జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ... ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్. ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం అని మెరుగైన సమాజం కోసం ఆయన చూపిన మార్గాన్ని ఐకమత్యంతో అనుసరించాలని సూచించారు., అందులో భాగంగానే గతంలో వరదలు వచ్చిన సమయంలో యూరియా పంపిణీలో చేసిన కృషి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో పోలీసు యంత్రాంగం జిల్లా యంత్రాంగం పకడ్బందీ ప్రణాళికతో రైతులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలా ముందుకు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నామని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు తిరుపతిరావు, శ్రీనివాసరావు, విజయ ప్రతాప్, మోహన్, సిఐలు మహేందర్ రెడ్డి, సర్వయ్య, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు.

## -కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి భూక్యా ప్రవీణ్ నాయక్.



**బయ్యారం,తోవ్వ,అక్టోబర్ 31.**
భారత ఉక్కు మహిళ, భారతదేశ మొట్టమొదటి మహిళ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని గంధంపల్లి కొత్తపేట పంచాయతీ పరిధిలో ఇందిరా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య ప్రవీణ్ నాయక్ పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ అభివృద్ధి,ఐక్యత,సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అర్పించిన మహానేత ఇందిరా గాంధీ అని,వారు చూపిన మార్గం ఇప్పటికీ దేశ ప్రజలకు ప్రేరణగా నిలుస్తోందని వారి సేవలను స్మరించుకున్నారు.సమాజంలో సమానత్వం,మహిళా సాధికారతకు మార్గదర్శకురాలిగా భారత ఉక్కు మహిళ,భారతదేశ మొట్టమొదటి మహిళ ప్రధానిగా నిలిచారని,భారత దేశ ప్రజల హక్కుల కోసం చివరి వరకూ పోరాడిన నాయకురాలు ఇందిరమ్మ అని కొనియాడారు..ఈ కార్యక్రమంలో జూలకంటి సీతారాం రెడ్డి,మాజీ అధ్యక్షులు వడ్లమూడి సురేష్ బాబు,పుల్లూరి బాలరాజు,బాలకృష్ణ,కొల్లిపాక రవి,దానకొండ నాగరాజు,వీరన్న,నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.



# పంట పొలాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి.

## -రైతులు పంట సాగు వివరాలు నమోదు చేసుకోవాలి.

-జిల్లా వ్యవసాయ అధికారి. విజయనిర్మల.



**బయ్యారం,తోవ్వ,అక్టోబర్ 31.**
మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలో వరి సాగు పంట పొలాలను క్షేత్రస్థాయిలో శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతు తమ సాగు భూములలో ఏ ఏ పంటలను సాగు చేశారో ఆ పంటలను వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద వారి వ్యవసాయ క్లస్టర్ పరిధిలో వ్యవసాయ శాఖ ప్రత్యేక యాప్ ద్వారా అధికారుల వద్ద రైతుల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.పంట నమోదు వలన రైతుకు ఏ ఇబ్బంది కలగకుండా పంటను విక్రయించేందుకు మార్గం సుగమముగా ఉంటుందని తెలిపారు.తప్పకుండా రైతులు తమ పంట సాగు నమోదు చేసుకోవాలని కోరారు.మండలంలో తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతుల పంట పొలాలు ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు.మండల వ్యవసాయ అధికారి రాజు, ఏఈఓలు నాగరాజు,అఖిల్ రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా వుషూ పోటీలో 22 మెడల్స్

తొవ్వ, మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 31:



రాష్ట్రస్థాయి కేలో ఇండియా వుషూ పోటీలో మానుకోటకు చెందిన 22 విద్యార్థినిలకు గోల్డ్ అండ్ సిల్వర్ మెడల్స్ వచ్చాయి. ఈ సందర్భంగా శుక్రవారం మహబూబాబాద్ జిల్లా క్రికెటర్ అసోసియేషన్ అధ్యక్షుడు, సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ అభినందించారు. అక్టోబర్ 26న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా వుషు ఉమెన్స్ లీగ్ 2025 పోటీలలో మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన 22 మంది వుషు సిస్టర్స్ అకాడమీ విద్యార్థినీలు గోల్డ్ మెడల్ పథకాలు సాధించారు. ఈ సందర్భంగా అకాడమీ కోచ్ జహీద్ అధ్యక్షతన అభినందన సభ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మహబూబాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ... మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన 22 మంది విద్యార్థినీలకు గోల్డ్ అండ్ సిల్వర్ మెడల్స్ రావడం సంతోషకరం అన్నారు. మానుకోట క్రీడలకు పుట్టినిల్లు అన్నారు. ఉమ్మడి జిల్లాలకు రాష్ట్రస్థాయిలో అన్ని క్రీడలకు గుర్తింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా వుషు క్రీడలలో మెడల్స్ సాధించిన విద్యార్థులు రానున్న కాలంలో జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మానుకోట ప్రాంతంలో ప్రభుత్వం స్టేడియంను నిర్మించి అన్ని విధాల క్రీడాలను క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు. ముఖ్యంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే మురళి నాయక్, ఎంపీ బలరాం నాయక్ స్టేడియం నిర్మాణానికి సహకరించి క్రీడాకారులను ఆదుకోవాలని చెప్పారు. విద్యార్థినిలకు మెడల్స్ అందించి శాలువా కప్పి ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్స్ ఆయేషా తస్నీమ్, సోహ తబస్సుం, పేరెంట్స్ పి రమణ ఉమా, పెరుగు కుమార్, వీరవెల్లి రవి, మహెూస్నవి, ఎండి జోహా, బి నిహారిక బి. జెస్సి, టి. గీత, పి. కీర్తన, పి. లాస్య ప్రియ, ఏ. దీప, ఈ.పసు న్నిసా, ఎండి సహిస్తా, మినహా తిరదోస్కే, మినహా పిర్దోస్, సిహెచ్ లిప్సిక, ఎండి రుబీనా, ఏ.అమూల్య, బి. హిమబిందు, మదిహా ఫిర్దోస్, నసీరీన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలో నీటిని వెంటనే తొలగించాలి

## స్థానిక రైల్వే స్టేషన్ ముందు విద్యార్థులతో సిపిఎం,ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ధర్నా

యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధిబీ అక్టోబర్ 31

రామన్నపేట పరిధిలో కొమ్మాయిగూడెం మరియు సిరిపురం రైల్వే అండర్ పాస్ వంతెన వద్ద వర్షం మూలంగా నిలిచిపోయిన నీటిని తొలగించి విద్యార్థులు, గ్రామాల ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జిల్లాల పెంటయ్య, సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం రైల్వే అధికారులను డిమాండ్ చేశారు. సిపిఎం ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు,తల్లిదండ్రులతో కలిసి స్థానిక రైల్వే స్టేషన్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం సంబంధిత అధికారి పీడబ్ల్యూ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే అధికారుల ముందు చూపు లేక అండర్పాస్ వే నిర్మాణం చేయగా వర్షాలు పడినప్పుడు నీళ్లు నిలిచిపోయి నిత్యం ప్రయాణికులు పోలేక రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గత రెండు రోజులుగా వడ్ల లారీ మధ్యలోనే ఆగిపోయి ప్రజలు సమస్య ఎదుర్కొంటున్నారని, స్థానిక మండల కేంద్రంలో ఉన్న పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు బస్సులు రాక తల్లిదండ్రులు ప్రతినిత్యం చుట్టూ తిరిగి వారి వెంటే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీని మూలంగా విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని అన్నారు. రైతులు పండించిన పంట కనీస మార్కెట్ కు చేర్చలేకపోతున్నారని. నిత్యం మండల కేంద్రానికి చౌటుప్పల్ కు వెళ్లే ప్రయాణికులు ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అనేకసార్లు విన్నవించిన రైల్వే అధికారులు పట్టించుకోవడంలేదని తమ రైళ్లకు 10 నిమిషాలు అంతరాయం కలిగిన వెంటనే స్పందించే రైల్వే అధికారులు గత పది రోజులుగా ప్రయాణికులు ప్రజలు ఇబ్బంది పడుతున్న ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే 7 హెచ్.పి నీటిని తొలగించి ప్రజల ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా చూడాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ధర్నాకు స్పందించిన రైల్వే అధికారులు సమస్యను వెంటనే పరిష్కారం చేస్తామని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు అనంతరం ధర్నా విరమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బలుగూరి అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరెళ్ళ నర్సింహా చారి, కల్లూరి నాగేష్, మండల కమిటీ సభ్యులు గొరిగే సోములు,డివైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు శానగొండ రామచంద్రం, మెట్టు శ్రవణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, శాఖ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, శానకొండ వెంకటేశ్వర్లు, అప్పం సురేందర్, నాగటి లక్ష్మణ్, ఆకిటి శ్రీను, ఉన్న దత్తాద్రి, కుమారస్వామి విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# తడిసి రంగు మారిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలి

## రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి



యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: అక్టోబర్ 31

అకాల వర్షం మూలంగా తడిసి రంగు మారిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేసి రైతుల సమస్య పరిష్కరించాలని, ధాన్యం కొనుగోలను వేగవంతం చేసి వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రామన్నపేట వ్యవసాయ మార్కెట్లో సిపిఎం-రైతు సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షం మూలంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పోసిన రాశులు వర్షానికి తడిసి రైతులు తీవ్రంగా నష్టపోవడం జరిగిందని. కొనుగోలు వేగవంతం కాకపోవడంతో రోజుల తరబడి రైతులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రామన్నపేట మార్కెట్లో ధాన్యం రాశులు పోసి 20 రోజులు గడుస్తున్న కేవలం ఇప్పటికి రెండు లారీలు మాత్రమే పోయాయని, ఒక కాంట మాత్రమే తూకం వేస్తున్నారని అన్నారు. మండల వ్యవసాయ అధికారులు ధాన్యం పరిశీలన చేసి, మ్యాచర్ చూసి ఏ గ్రేడ్ కింద రాసిన జిల్లా అధికారులు వచ్చి వాటిని బి గ్రేడ్ కింద మార్చి రైతులను మోసగిస్తున్నారని, జిల్లా సివిల్ సప్లై అధికారులు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతులను మోసగిస్తున్నారని దీనిపై సమగ్ర విచారణ జరపాలని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రకటనలో ప్రతి గింజ కొనుగోలు చేస్తామని చెప్తూ తడిసిన రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయమంటూ రైతులను బెదిరింపులకు గురి చేస్తుందని ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేసి రైతులను కాపాడాలని ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రైతుల ఖాతాల్లో 48 గంటల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బలుగూరి అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కందుల హనుమంతు, కల్లూరి నాగేష్, మండల కమిటీ సభ్యులు గొరిగే సోములు, భావండ్లపల్లి బాలరాజు, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష,కార్యదర్శులు శానగొండ రామచంద్రం, మెట్టు శ్రవణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, శాఖా కార్యదర్శులు మునికుంట్ల లెనిన్, శానగొండ వెంకటేశ్వర్లు,అప్పం సురేందర్,నాగటి లక్ష్మణ్, మేడి ముకుందం,కూనూరు గణేష్, బూడిద వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం



యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధి :అక్టోబర్ 31

జాతీయ ఐక్యత దినోత్సవం, సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రామన్నపేట పోలీస్ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ ని సుబాష్ విగ్రహము నుండి అంబేద్కర్ విగ్రహం వరకు 2కె రన్ ను తహసిల్దార్ ,ఎంపీడీవో మరియు రామన్నపేట ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు స్వాతంత్ర సమరయోధులు సేవల గురించి, వారు చేసిన త్యాగము గురించి మరియు ప్రజలకు మరియు పోలీసు వారికీ ఉన్న సంబంధాల గురించి ప్రజలకు అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమం లో తహసిల్దార్ సిఎల్ బహదూర్, ఎంపీడీవో రాములు, పోలీస్ సిబ్బంది కే రాంబాబు, సీహెచ్.సత్యనరాయణ, డీ.స్వామి, టీ.ప్రవీణ్ కుమార్, సైదులు,కృష్ణమూర్తి,రవి, జూనియర్ కాలేజి విద్యార్ధిని విద్యార్థులు, కాలేజి సిబ్బంది మండల ప్రజలు పెంటయ్య, సల్వేరు అశోక్, వెంకటేష్, బల్గురి అంజయ్య, సోమయ్య, నాగేష్, ఉదయ్ ఇతర అధికారులు మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే



తొవ్వ, మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 31:

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మహబూబాబాద్ శాసనసభ్యులు డా భూక్యా మురళీ నాయక్ శుక్రవారం పర్యటించారు మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఏటిగడ్డతండా సమీపంలో ఉన్న మున్నేరు వాగు వద్ద మొంథ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న రోడ్డు, కూలిన విద్యుత్ స్తంభాలు, దెబ్బతిన్న పంటలను పరిశీలించి వరద ప్రభావంతో వరి పొలాల్లోకి పూర్తిక ఇసుక మేటలు వేయడంతో తీవ్రంగా రైతులు నష్టపోయినారని అన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అక్కడి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రజల భద్రత దృష్ట్యా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, పట్టణ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు ,తదితరులు పాల్గొన్నారు



# ఇందిరా గాంధీ, సర్దార్ వల్లభాయ్ చిత్ర పటాలకు నివాళిలు అర్పించిన ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షురాలు..

## నివాళీలు అర్పించిన కాంగ్రెస్ శ్రేణులు..

తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 31:



భారత దేశ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి, భారత దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి లను పురస్కరించుకొని హనంకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలవేసి ఘనమైన నివాళులర్పించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ,వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మహిళా శక్తికి మార్గదర్శిగా నిలిచినా మహెూన్నత నాయకురాలు ఇందిరా గాంధీ.పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్నో చట్టాలను తెచ్చి వారికీ బాటలు వేసిన ఇందిరా గాంధీ.ఇందిరా గాంధీ గారి 41వ వర్ధంతి సందర్భంగా ఈ రోజు దేశ వ్యాప్తంగా వారి సేవలను, ఆ కుటుంబ చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటున్నారు.నాడు కాంగ్రెస్ పార్టీ ఇందిరా గాంధీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని ముందు వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లతో పేద నిరుపేద కుటుంబాలకు గృహకల్పన కల్పించామని అన్నారు.గతంలో ఇందిరమ్మ పేరుమీద ఏ పథకం ప్రారంభించిన కూడా పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే విజయవంతం జరిగిందని అన్నారు. చరిత్రలో సూర్యచంద్రులు ఉన్నంతవరకు ఇందిరాగాంధీ మరియు వారి కుటుంబం చేసిన సేవలు అభివృద్ధి చిరస్థాయిగా నిలుస్తాయని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# వరద ప్రభావిత ప్రాంతాల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య విస్తృత పర్యటన

## ఎన్డీఆర్ఎఫ్ బోటులో లోతట్టు ప్రాంతాలకు చేరుకుని పాల ప్యాకెట్లు, త్రాగునీరు, ఆహారాన్ని స్వయంగా అందజేసిన ఎంపీ

## వరద ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా ఆహారం, తాగునీరు పంపిణీ విధానాన్ని పరిశీలించిన ఎంపీ

**తొవ్వ ,ప్రతినిధి,అక్టోబర్ 09:**
మొంథా తుఫాను ప్రభావంతో వరద నీటిలో మునిగిపోయిన హనుమకొండ గోపాలపురం, టీఎన్జీవోస్ కాలనీ తదితర లోతట్టు ప్రాంతాలను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య స్వయంగా పర్యటించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వరద ప్రభావిత ప్రాంతాల్లో నిరంతర పర్యటన నిర్వహిస్తూ పరిస్థితిని ప్రత్యక్షంగా ఎంపీ పరిశీలించారు గోపాలపురం ప్రాంతంలో వరద ఉధృతి తీవ్రతను గమనించిన ఎంపీ వెంటనే ఇరిగేషన్ అధికారులతో







మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం టీఎన్జీవోఎస్ కాలనీలో ఎన్డీఆర్ఎఫ్ బృందంతో కలసి బోటులో ప్రయాణిస్తూ మొత్తం ప్రాంతాన్ని పరిశీలించారు. జల దిగ్బంధంలో ఉన్న ఇళ్ల వద్దకు స్వయంగా చేరుకుని, ప్రజలకు ధైర్యం చెబుతూ పాల ప్యాకెట్లు, త్రాగునీరు, ఆహార ప్యాకెట్లు అందజేశారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విన్న ఎంపీ, తాత్కాలిక ఉపశమనంతో పాటు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

వరంగల్

వరంగల్ బి ఆర్ నగర్ కాలనీ వరద ప్రభావిత ప్రాంతాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్వయంగా పర్యవేక్షించారు. అక్కడ డ్రోన్‌ల ద్వారా ఆహారం, తాగునీరు పంపిణీ జరుగుతున్న విధానాన్ని మంత్రి కొండ సురేఖ, కలెక్టర్ డాక్టర్ సత్య శారద గార్లతో కలిసి పరిశీలించిన ఎంపీ డా. కడియం కావ్య ప్రజలకు ధైర్యం చెప్పారు. ప్రతి కుటుంబానికి సహాయం వేగంగా చేరేలా అధికారులకు సూచనలు చేశారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతాయని ఎంపీ భరోసా ఇచ్చారు.

# ఏరియా ఆసుపత్రి పై వదంతులు నమ్మొద్దు

**తొవ్వ ,మహబూబాబాద్ ,అక్టోబర్ 30:**
మహబూబాబాద్ జనరల్ హాస్పిటల్‌లో బతికి ఉన్న వ్యక్తిని మార్చురీలో పెట్టారంటూ వస్తున్న వార్తలు అవాస్తవం అని హాస్పిటల్ సూపరింటెండెంట్ తెలిపారు.రోడ్డుపైన, వర్షంలో పడి ఉన్న బెగ్గర్‌ను మానవత్వంతో మార్చురీ సెక్యూరిటీ సిబ్బంది హాస్పిటల్‌లో చేర్పించారు.భారీ వర్షంలో రోడ్డుపైన, నడవలేని స్థితిలో ఉన్న వ్యక్తిని మార్చురీ సిబ్బంది దగ్గర్లో ఉన్న బెంచ్‌పైకి చేర్చి అక్కడి నుంచి వార్డుకు షిఫ్ట్ చేశారు.దాన్ని వక్రీకరించి కొంతమంది ప్రభుత్వ హాస్పిటల్‌పై బురదజల్లే కుట్ర చేస్తున్నారు.రాజకీయ కుట్రల్లో ప్రభుత్వ దవాఖాన్లను బలి చేయొద్దని, పేద ప్రజల దేవాలయాలపై విషం చిమ్మొద్దని హాస్పిటల్ సూపరింటెండెంట్ విజ్ఞప్తి చేశారు.



# అక్రమ వలసదారులకే కాంగ్రెస్ రక్షణ

## – గోరక్షకులపై తప్పుడు కేసులు: కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు

## – ప్రభుత్వం చేయాల్సిన పనిని గోరక్షకులు చేస్తుంటే వారినే వేధిస్తోంది

## – కేంద్ర మంత్రి ఆరోపణ

హైదరాబాద్, అక్టోబర్ 30 :
భారతదేశంలో ప్రజల భద్రతకు కట్టుబడి ఉండాల్సిన ప్రభుత్వం, దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జీ. కిషన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. అక్రమంగా దేశంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు, అక్రమ వలసదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం రక్షణ కవచంలా మారిందని ఆయన ఆరోపించారు. దేశ ప్రజలకంటే అక్రమ వలసదారులకే కాంగ్రెస్ ప్రభుత్వం రక్షణ ఇస్తోంది. అక్రమంగా గోవులను తరలిస్తూ, చంపి, వాటి మాంసాన్ని మోసపూరితంగా విక్రయిస్తున్న సంఘవిద్రోహ శక్తులను అడ్డుకోవాల్సింది పోయి, వారినే కాపాడుతోంది అని అన్నారు. గోరక్షకులపై తప్పుడు కేసులు నమోదు చేసి, అరెస్టు చేసి, జైలులో వేయడం ద్వారా ప్రభుత్వం తన అసలు స్వరూపాన్ని బయటపెడుతోంది అని ఆయన మండిపడ్డారు. గోరక్షకులు దేశ చట్టాన్ని కాపాడటమే లక్ష్యంగా పనిచేస్తుండగా, వారిపై తప్పుడు ఆరోపణలు మోపడం కాంగ్రెస్ పాలనలో కొత్త పంథాగా మారిందని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి మరోసారి హితవు పలుకుతూ, “ప్రజలపై తుపాకులతో దాడి చేస్తున్నవారిని ప్రభుత్వం మన్నిస్తూ, చట్టానికి కట్టుబడి ఉన్న వారిని శిక్షిస్తోంది. ఇది ప్రజాస్వామ్యానికి మచ్చ” అని అన్నారు. ప్రభుత్వం చేయాల్సిన పనిని గోరక్షకులు చేస్తుంటే, వారినే ఇబ్బంది పెట్టడం ప్రజల్లో ఆగ్రహం రేపుతోందని ఆయన పేర్కొన్నారు. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలతో తెలంగాణలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై బీజేపీ తరచూ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్న నేపథ్యంలో, ఆయన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.




# జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుంది

## – ప్రజా హామీలు నెరవేర్చాం

## – రేషన్ కార్డులు, నాణ్యమైన బియ్యం పంపిణీ

## – ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 30:
జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించబోతుందని, ప్రజల విశ్వాసం తమ పక్షాన ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన సోషల్ మీడియా వేదికగా చేసిన ప్రకటనలో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడిందని తెలిపారు. “జూబ్లీహిల్స్ మాత్రమే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై సంతోషంగా ఉన్నారు” అని ఉత్తమ్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఎలాంటి రాజీ పడలేదని అన్నారు. ప్రజలకు అందజేసిన రేషన్ కార్డులు, పంపిణీ చేసిన నాణ్యమైన బియ్యం కాంగ్రెస్ పాలనలో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చాయని వివరించారు. ఉపఎన్నికలో ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ అభ్యర్థి అత్యధిక మెజార్టీతో గెలుస్తాడని ఆయన ధీమా వ్యక్తం చేశారు. “కాంగ్రెస్ ప్రజలతో ఉన్న పార్టీ, ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ప్రభుత్వం” అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.



# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపుతో కాంగ్రెస్‌కి కనువిప్పు కలగాలి

## – ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

## – బోరబండలో మాగంటి సునీత గోపీనాథ్‌కు మద్దతుగా ప్రచారం

హైదరాబాద్, అక్టోబర్ 30 :
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపుతో కాంగ్రెస్ పార్టీకి కనువిప్పు కలగాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆకాంక్షించారు. బోరబండ డివిజన్ ఇంచార్జ్‌గా ఆయన గురువారం బాబా సైలానీ నగర్‌లో మాగంటి సునీత గోపీనాథ్కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సునీత కుమార్తెలు దీక్షిత, అక్షితలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ “మన బతుకులకు భరోసానిచ్చిన పార్టీ బీఆర్ఎస్. కానీ అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించిన పార్టీ కాంగ్రెస్. హామీలను నిలబెట్టుకోలేక ప్రజలకు మొండి చెయ్యి చూపింది,” అని విమర్శించారు. నవంబర్ 11న జరగబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పక్షాన నిలబడి, ‘కారు’ గుర్తుకు ఓటు వేసి మాగంటి సునీత గోపీనాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.








# న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలికా సదనంలో దీపావళి

తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 18:

మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తి ఎస్. షాలిని శనివారం స్థానిక బాలికల వసతి గృహాన్ని (బాలసేవాసదన్) మరియు బాలుర వసతి గృహంను( చిల్డ్రన్ హోమ్) సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు సరైన సమయానికి ఆహారాన్ని అందించాలని, మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తవి సూచనలు చేశారు. పిల్లలకు అందుతున్న సౌకర్యాలను గురించి వసతిగృహ సూపరింటెండెంట్ ధనలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. తనిఖీ అనంతరం న్యామూర్తి పిల్లలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా బాలికలు తాము దీపావళిపండుగ జరుపుకోవాలనుకుంటున్నామనే కోరికను న్యాయమూర్తి ఎదుట వెలిబుచ్చగా స్పందించిన న్యాయమూర్తి వెంటనే తన సిబ్బంది ద్వారా బాలుర మరియు బాలికలకు వారివారి వసతి గృహాల్లో కాకర పువ్వత్తులు, భూ చక్రాలు, మతాబులను తెప్పించారు. అంతేకాకుండా న్యాయమూర్తి స్వయంగా బాలికలతో కలిసి వాటిని వెలిగించి వారితో సరదాగా కాసేపు గడిపారు. బాలికలకు స్వీట్లు చాక్లెట్లను పంచిపెట్టారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తి దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ కాకరవత్తులను భూ చక్రాలను కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



# ఆరుట్ల గ్రామంలో ఘనంగా  ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు

## మాజీ సర్పంచ్ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

## మంచాల సహకార బ్యాంక్ చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండలంఅధ్యక్షుడు వింజమూరి రాంరెడ్డి



**తొవ్వ, ప్రతినిధి, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 31**
మంచాల మండలంఆరుట్లగ్రామంలో స్వర్గీయభారతప్రధానిఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆరుట్ల కాంగ్రెస్ పార్టీగ్రామశాఖఅధ్యక్షుడురావులభాష ప్రధానకార్యదర్శిదాసరమోని రమే ష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారుఅనంతరంపండ్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంచాల వ్యవసాయసహకారసంఘంచైర్మన్ వెదిరెహన్మంత్,రెడ్డి కాంగ్రెస్,పార్టీమంచాలమండలంఅధ్యక్షుడువింజమురిరాంరెడ్డికాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్, రెడ్డి కలిసి మాట్లాడుతూ స్వర్గీయ భారత ప్రధాని ఇందిరా గాంధీ బడుగు బలహీన వర్గాల పేద ప్రజల కోసం



ఎన్నో సంక్షేవ ుమ పథకాలు ప్రవేశపెట్టిదే శప్రజల గుండెల్లో చిరస్థాయి గాని లిచిన గొప్పప్రధానిఇందిరాగాంధీఅన్నారుఅనాడు గరీబోహటావో అనేనినాదంతో నిరుపేద కుటుంబాలఅందరికీపక్కాఇండ్లునిర్మించిపంపిణీచేసిన గొప్పనాయకురాలు ఇందిరాగాంధీ అన్నారు నేడు అదేబాటలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంది రాగాంధీ ఆశయ సాధనకోసం తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకంప్రవేశపెట్టిన ఇందిరాగాంధీ పేరు పెట్టడం జరుగుతుంది అన్నారు ప్రతి కాంగ్రెస్ ,పార్టీనాయకుడు కార్యకర్తలు ఇందిరాగాంధీ ఆశయసాధన కోసంపనిచేయాలనిఅన్నారుఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం కిసాన్,సెల్,అధ్యక్షుడు కావాలి బుగ్గ రాములు ముదిరాజ్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ జెనిగె వెంకటేష్ యాదవ్, మాజీ ఎంపిటిసిలు కావలి శ్రీనివాస్ ముదిరాజ్,ఎద్మనరేందర్ రెడ్డి మాజీ సర్పంచ్ చీమల జంగయ్య యాదవ్ కాంగ్రెస్,పార్టీమాజీమండలఅధ్యక్షుడు ముచ్చర్ల వెంకటేష్ యాదవ్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు యండి సలాం ఇందిరమ్మ కమిటీ సభ్యులుబుట్టికృష్ణముదిరాజ్,మారబౌరమ్మ.లక్ష్మణ్ మంచాల మండలం యూత్ కాం గ్రెస్ అధ్యక్షుడు రావుల రాఘవ కాంగ్రె స్ పార్టీనాయకులుపంబాలబుగ్గ రా ములుగుడిమల్లచంద్రయ్య ముదిరాజ్ ,కావలిశ్రీనివాస్, ముదిరాజ్(హోటల్) మాదగోని జంగయ్య గౌడ్ అంతటి రాజుగౌడ్,మారగోనిమసయ్యగౌడ్ తలారి కృష్ణ ముదిరాజ్ బుట్టిజంగ య్యముదిరాజ్ మరసురేష్ మెగావ త్ లక్ష్మణ్ నాయక్ మానిపాటి వెంక టేష్ సుంకరిప్రవీణ్ గౌడ్ ఎన్నుదుల సురేష్ మంకు ప్రవీణ్ బీరుమల్లే ష్ మనిపాటి గణేష్ నూత నగంటి లక్ష్మయ్య పాండాల శ్రీనివాస్ గౌడ్ యండి అష్రఫ్,రైనాముదిరాజ్ తది తరులు పాల్గొన్నారు

# తుంగతుర్తి ఎస్ఐ వేధింపులకు మహిళ బలి!

## దొంగతనం నెపంతో వేధింపులు

## అవమానభారంతో సూసైడ్ ఆరోపిస్తున్న బాధిత కుటుంబసభ్యులు

**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 31:**
ఎస్ఐ వేధింపులు తాళలేక అవమాన భారంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెంపటి గ్రామంలో జరిగింది. మృతురాలి కుటుం బ సభ్యుల కథనం ప్రకారం.. వెంపటి గ్రామానికి చెందిన సోమ నర్సమ్మ(50) బావ మల్లయ్య ఇంట్లో 15రోజుల క్రితం బంగారం చోరీ జరిగింది. దీన్ని సోమనర్స మ్మనే చేసిందని ఆరోపిస్తూ తుంగతుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సోమనర్సమ్మను పిలిపించి గురువారం రాత్రి వరకు పోలీస్ స్టేషన్ లోనే ఉంచారు. ఎస్ఐ క్రాంతికు మార్ కనీసం మహిళ అని చూడకుండా వేధింపులకు గురిచేశాడు. 'నిన్ను జైలుకు పంపుతాం, నీవే దొంగతనం చేసినట్లు ఒప్పుకో.. నీ ఫింగర్ ప్రింట్స్ ఉన్నాయి' అని బెదిరింపులకు గురిచేశాడు. దీంతో ఆవేదనకు గురైన ఆమె గురువారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జరిగిన సంఘటనపై ఎని వివరణ కోరగా సమాధానాన్ని దాటవే శారు. సోమనర్సమ్మ మృతికి కారణమైన ఎస్ఐ క్రాంతి కుమార్పై ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.




# మార్చురీ ఘటనపై విచారణ....

## ఏరియా ఆసుపత్రిని సందర్శించిన విచారణ బృందం

**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 31:**

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన 'బతికుండగానే మార్చురీ'కి ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలోనే డీఎంఈ ఆదేశాలతో ములుగు జనరల్ ఆస్పత్రి సూపరెండెంట్ చంద్రశేఖర్, జనగామ జనరల్ ఆస్పత్రి సూపరెండెంట్ గోపాల్రావు, సిద్ధిపేట మెడికల్ కాలేజ్ ఫోరెన్సిక్ నిపుణులు శ్రీధర్లతో కూడిన వైద్య బృందం ఇవాళ మానుకోట ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని విచారణ ప్రారంభించారు. అసలు ఏం జరిగింది? ఎలా జరిగింది? అనే కోణంలో ఐసీయూలో చికిత్స పొందుతున్న బాధిత రోగి వెల్జి రాజు ను అడిగి వాగ్మూలం రికార్డ్ చేశారు. అలాగే పోలీసులను వివరాలు అడిగి తెలుసుకోనున్నారు . , పూర్తి విచారణ చేపట్టి రిపోర్టును పై అధికారులకు పంపిస్తామని వివరాలు బహిర్గతం చేయలేమని బృందం తెలిపింది.




## ముఖ్యమంత్రి వరంగల్ పర్యటన చిత్ర మాలిక







## నూతన వధూవరులను ఆశీర్వదించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదల్ల యాదవ రెడ్డి



**తొవ్వ, నెల్లికుదురు, అక్టోబర్ 31:**
మండలంలోని ఎర్రబెల్లి గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల కార్యదర్శి సొంటి రెడ్డి అశోక్ రెడ్డి అల్లుడు వివాహ వేడుకలు హనుమకొండ లోని ఆర్వి కన్వెన్షన్ లో నిర్వహించగా మహబూబాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదల్ల యాదవ రెడ్డి హాజరై నూతన వధూవరులు బండ అఖిల్ రెడ్డి– సాహితి రెడ్డిలను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. కలకాలం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఐశ్వర్యంతో సుఖసంతోషాలతో దాంపత్యం విలసిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు పెరుమాండ్ల జగన్ బాబు, నిధనపెల్లి ప్రవీణ్  తదితరులు పాల్గొన్నారు..

## జాతీయ మాల మహానాడు నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, జిల్లాల ఇంచార్జిగా అశోధ భాస్కర్



తొవ్వ, నెల్లికుదురు, అక్టోబర్ 31
జాతీయ మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్ సూచనల మేరకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నల్లగొండ, సూర్యపేట, ఖమ్మం జిల్లాల ఇన్చార్జిగా జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ ను నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మాట్లాడుతూ  జిల్లా అధ్యక్షులు వర్కింగ్ ప్రెసిడెంట్ లతో సమన్వయం, సంఘ బలోపేతం గ్రామ గ్రామాన అంబేద్కర్ జ్యోతిబాపూలే సిద్ధాంతాలను తీసుకెళ్లేందుకు చురుకుగా పని చేయాలని కొత్త బాధ్యతలతో జాతీయ మాల మహానాడు కార్యకలాపాలు మరింత బలపడుతాయని తెలిపారు. తనపై నమ్మకంతో మూడు జిల్లాల బాధ్యతలను అప్పగించిన వ్యవస్థాపక అధ్యక్షులు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్ ల తోపాటు రాష్ట్ర నేతలకు అశోద భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు..

## ప్రైవసీకి అడొస్తుందని..

# ప్రియురాలి కూతురు హత్య

## బెంగళూరులో విషాద ఘటన

తొవ్వ డెస్క్ ,అక్టోబర్ 31:
ప్రైవసీకి అదొ స్తుందని ప్రియురాలి కూతురిని హత్య చేసిన అమానుష ఘటన బెంగళూరులో జరిగింది. ఎస్కే.శిల్ప ప్రైవేట్ కంపెనీలో బిజినెస్ డెవల ప్మెంట్ ఆఫీసర్గా పని చేస్తోంది. ఇప్పటికే భర్తతో విడాకులు తీసు కున్న ఆమె తల్లితో ఉంటూ బిడ్డను పెం చుతోంది. తల్లి మరణం తర్వాత ఇన్స్టాగ్రామ్లో పరిచయమైన మార్కెటింగ్ మా జీ ఎగ్జిక్యూటివ్ దర్శన్ కుమార్యాదవ్తో ప్రేమలో పడింది. కానీ అతను ఆమె కూతు రు సిరిని యాక్సెప్ట్ చేయలేకపో యాడు. ఆమెను హాస్టల్లో వదిలేయాలని.. తమ ప్రైవసీకి అదొస్తుందని ఒత్తిడి చేశాడు. అందుకు శిల్ప ఒప్పుకోక పోవడంతో వివాదాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో కొట్టడం ప్రారంభించిన అతడు తల్లీ కూతురిని హత్య చేస్తానని బెదిరించేవాడు. ఈ క్రమంలోనే అక్టోబర్ 23న రాత్రంతా శిల్ప ఇంట్లోనే ఉన్న అతడు ఆమె ఉదయం పనికి వెళ్లాక సిరినితీసుకు ని తన ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్నం ఆమెకు కాల్ చేసి వెంటనే రావాలని పిలిచాడు. ఈ సమయంలో సిరి ఏడుస్తూ కేక లు వేయడం విన్న ఆమె.. ఇంటికి చేరు కుంది. అప్పటికే కోపంతో ఉన్న దర్శన్.. శిల్పను గదిలో బంధించాడు. ఆమె బయ టకు వచ్చేసరికి.. మరో గదిలో సిరి నిర్జీ వంగా రక్తపు మడుగులో పడి ఉంది. శిల్ప ఫిర్యాదుతో పోలీసులు దర్శనను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు నిజాలు ఒప్పుకున్నాడు.

